

అన్నదాతలకు మద్దతు ధరలు కల్పిస్తూ సీఎం చంద్రబాబు రైతుల పక్షాన నిలుస్తున్నారు. రైతులకు మేలు జరుగుతుండటాన్ని వైసీపీ జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోంది. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 14.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 174 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# దేశాభివృద్ధే మనందరి లక్ష్యం

రాష్ట్రాలు వేరైనా ఆకాంక్ష ఒక్కటే / గోదావరి-కావేరి అనుసంధానంతో సాగునీటి ప్రయోజనాలు / 2047 నాటికి భారత్ అగ్రస్థానానికి చేరాలి / విజయవాడ ఉత్సవ్‌లో చంద్రబాబు, విజయ్ సందేశం







**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లిపోయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్ 2.0' కార్యక్రమంలో విజయ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత ఉత్సాహాన్ని చూసి పులకించిపోయారు. రాష్ట్రాలు వేరైనా దేశాభివృద్ధే అందరి లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గోదావరి-కావేరి నదుల అనుసంధానం సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

**యువత ఉత్సాహం చూస్తుంటే ఆనందంగా ఉంది :** దుర్గమ్మ తల్లి, భారతమాత, తెలుగు తల్లికి జయజయధ్వానాలు పలుకుతూ చంద్రబాబు ప్రసంగాన్ని ప్రారంభించారు. విజయ్ రాకతో యువతలో ఉత్సాహం ఉరకలేస్తోందని అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ తొలిసారిగా మరో రాష్ట్రానికి రావడం, అందుకు విజయవాడ వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. తమిళనాడును అభివృద్ధి చేయాలన్న పట్టుదలతో రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన విజయ్ ప్రస్థానం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.

**ఐదు నదుల అనుసంధానంతో సస్యశ్యామలం :** గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. దుర్గమ్మ తల్లి సాక్షిగా విజయవాడ నుంచే గోదావరి, కృష్ణా నదులు కలిసే మహత్కార్యం జరగాలని ఆకాంక్షించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఈ లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులను అనుసంధానిస్తే నాలుగు రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. వ్యవసాయం, నీటి లభ్యతకు ఈ ప్రాజెక్టు ఎంతో మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**2047 నాటికి భారత్ అగ్రస్థానంలో ఉండాలి :** సభకు హాజరైన యువత ఉత్సాహం చూస్తుంటే దేశ భవిష్యత్తుపై నమ్మకం కలుగుతోందని మిగతా 2లో...

## జల బంధానికి ఇద్దరు సీఎంల భేటీ



- గోదావరి-కావేరి అనుసంధానంపై చర్చలు
- చెన్నై తాగునీటి అవసరాలు తీర్చాలని కోరిన తమిళనాడు సీఎం

**అమరావతి, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి సి జోసెఫ్ విజయ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మంగళవారం క్యాంప్ ఆఫీసుకు వచ్చిన సీఎం విజయ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు ముఖ్యమంత్రులు పలు అంశాలపై అధికారులతో కలిసి చర్చించారు. మిగతా 2లో...

## కిడ్నీ రోగులకు మరింత ఊరట

- త్వరలో అందుబాటులోకి మరో 22 డయాలసిస్ కేంద్రాలు
- రోగుల అవసరాలకు అనుగుణంగా కొత్త కేంద్రాల ఏర్పాటు
- ప్రతి కేంద్రంలో ఐదు యంత్రాలు.. రోజుకు 15 సెషన్లు
- 2025-26లో సేవలకు రూ.197.88 కోట్లు వ్యయం
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మూత్రపిండాల(కిడ్నీ) వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం (పీఎంఎన్‌డీపీ) కింద కొత్తగా మరో 22 కేంద్రాలు త్వరలో ఏర్పాటు కాబోతున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రోగుల అవసరాలు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో పిఎంఎన్‌డిపి కింద 61 కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. వీటికి అదనంగా కొత్తగా రానున్న 22 కేంద్రాల(మొత్తం 83) ద్వారా ఉచిత డయాలసిస్ (రక్తశుద్ధి) సేవలు పేదలకు మరింత చేరువ అవుతాయని వెల్లడించారు. ఇవి కాకుండా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా 170 కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు. ఈ రెండు పథకాల కింద ఉచితంగా అందించే డయాలసిస్ సేవల నిమిత్తం 2025-26లో రూ. 197.88 కోట్లు వరకు వ్యయమైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇటీవలి వరకు రూ. 90.09 కోట్ల విలువైన డయాలసిస్ సేవల్ని పేద రోగులు పొందారు.

**కూటమి ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 14 కొత్త కేంద్రాలు :** ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం కింద రాష్ట్రంలో 2019కు ముందు 28 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. మిగతా 2లో...

## స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ నేడే!



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. తొలి దశలో నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అనంతరం జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు, చివరగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా మూడు దశల్లో ఎన్నికల ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం.

తొలి దశలో 17 మంది మేయర్లు, 106 మంది మున్సిపల్ ఛైర్మన్లతో పాటు 3,884 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. రెండో దశలో 28 జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులు, 661 జడ్పీటీసీ, ఎంపీపీలు, 9,913 ఎంపీటీసీ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మూడో దశలో 13,351 మంది సర్పంచులు, 1,33,910 మంది పంచాయతీ వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ నెల 12న నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునేఠా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్, షెడ్యూల్‌పై ప్రకటన చేసే అవకాశం ఉంది.

## పల్లె బాటలకు ప్రగతి జోరు

- ఆత్మకూరులో రూ.8.91 కోట్లతో నాలుగు లేన్ల రహదారి
- రహదారికి 'వాయుపుత్ర మార్గ్'గా నామకరణం
- వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ, ఎన్‌హెచ్-67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు రూ. 8.91 కోట్ల వ్యయంతో నాలుగు లేన్ల రహదారిని అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మొత్తం 2.2 కిలోమీటర్ల మేర ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న ఈ రహదారికి వాయుపుత్ర మార్గ్‌గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. మంగళవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి ఆత్మకూరు రహదారిని వర్చువల్‌గా ప్రారంభించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నమైన ఎన్‌హెచ్-67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు సాకారం కావడం ఎంతో సంతోషకరం. మిగతా 2లో...



## 2,721 పోస్టులతో డిఎస్‌సి నోటిఫికేషన్

**అమరావతి :** ఉపాధ్యాయ నియామకాల కోసం 2,721 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. సాధారణ పాఠశాలల్లో 2,111 పోస్టులు, ప్రత్యేక విద్య విభాగంలో 350 పోస్టులు, వివిధ సొసైటీల పరిధిలో 260 పోస్టులను భర్తీ చేయనున్నారు. మిగతా 2లో...

## కేంద్ర మంత్రి పదవికి ఎల్. మురుగన్ రాజీనామా!



- తమిళనాడులో పార్టీ బలోపేతంపై దృష్టి
- రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కావాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి

**న్యూ ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర మంత్రివర్గంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. మిగతా 2లో...

## తెలుగు రాష్ట్రాల గర్వం.. శ్రీశైలం

- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రాజెక్టుకు చోటు
- డ్యామ్ పటిష్టత, విద్యుదుత్పత్తి సామర్థ్యానికి గుర్తింపు
- పట్టిసీమతో రాయలసీమకు ప్రయోజనం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం తెలుగు రాష్ట్రాల ప్రజలకు గర్వకారణమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. - 2లో...



## నిరసనలకు 'నో'.. రామ్‌లీలా బుకింగ్స్ ఫుల్!

- ఒక్కరోజు అద్దె, డిపాజిట్, పన్నులు కలిపి రూ.1.21 లక్షలు
- ఈ ఏడాదికి మిగిలింది మూడు రోజులే

**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** దేశ రాజధాని దిల్లీలో నిరసన కార్యక్రమాల నిర్వహణకు వేదికల కొరతతో పాటు ఆర్థిక భారం కూడా పెరుగుతోంది. నిరసనలకు వేదికగా ఉన్న జంతర్‌మంతర్‌ను తొలగించి, రామ్‌లీలా మైదానంతో పాటు బురారీ, సీబీడీ మైదానాలను ప్రత్యామ్నాయ వేదికలుగా దిల్లీ పోలీసులు ప్రకటించారు. అయితే రామ్‌లీలా మైదానంలో ఈ ఏడాది డిసెంబరు 29, 30, 31 తేదీల్లో మాత్రమే బుకింగ్‌కు అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మైదానంలో దాదాపు 50 వేల మంది కూర్చునే వీలుంది. ఇక్కడ ఒక్కరోజు నిరసన నిర్వహించేందుకు భద్రతా డిపాజిట్, పన్నులతో కలిపి రూ. 1.21 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. మైదానాన్ని దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యానవన విభాగం ద్వారా బుక్ చేసుకోవాలి. ఇందుకు ముందుగా దిల్లీ పోలీసుల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) పొందడం తప్పనిసరి. ఈ నిబంధనలు, భారీ ఖర్చు నిరసన కార్యక్రమాల నిర్వాహకులకు సవాలుగా మారుతున్నాయి. మిగతా 2లో...



# కిడ్నీ రోగులకు మరింత ఊరట



(మొదటి పేజీ తరువాయి)

2019-24 మధ్య 19 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. 2024-25 నుంచి మరో 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా ఇప్పుడు 22 కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిల్లో పలు కేంద్రాల ఏర్పాటులో న్యాయస్థానంలో విచారణ వంటి కారణాలతో జాప్యం జరిగింది. మొత్తం ఈ 22 కేంద్రాలను రోగులకు సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్క డయాలసిస్‌కు ప్రభుత్వం రూ.999 చొప్పున వ్యయం చేయనుంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఒక్కో డయాలసిస్ సెషన్‌కు రూ.3,000 నుంచి రూ.4,000 వరకు ఖర్చవుతుంది. రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి నెలకు నాలుగైదు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచితంగా రక్తశుద్ధి సేవలు అందుబాటులో ఉండటం బాధిత కుటుంబాలకు ఆర్థికంగా ఉపశమనం కలిగిస్తుంది.

**22 కేంద్రాలు.. ఎక్కడెక్కడంటే?** : పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం ఏరియా ఆసుపత్రి, చిత్తూరు జిల్లాలో పీలేరు ఏరియా ఆసుపత్రి, వైఎస్సార్ కడప జిల్లాలో జమ్మలమడుగు ఏరియా ఆసుపత్రి, మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో కొత్త డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కృష్ణా జిల్లాలో గన్నవరం సామాజిక ఆసుపత్రి, గుడివాడ ఏరియా ఆసుపత్రి, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో వెంకటగిరి, ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాలు, బాపట్ల జిల్లాలో అద్దంకి, రేపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రాలు, తిరుపతి జిల్లాలో రైల్వేకోడూరు, సత్యవేడు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రకాశం జిల్లాలో కొండెపి, తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, పల్నాడు జిల్లాలో వినుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రాలు, సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రి, విజయనగరం జిల్లాలో బొబ్బిలి సామాజిక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. నంద్యాల జిల్లాలో డోన్ ఏరియా ఆసుపత్రి, సున్నిపెంట సామాజిక ఆరోగ్య కేంద్రం, శ్రీ సత్యసాయి జిల్లాలో పెనుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రం, మడకశిర ఏరియా ఆసుపత్రిలలో కొత్తగా డయాలసిస్ సేవల్ని అందించనున్నారు.

**ఒక్కో కేంద్రంలో 5 డయాలసిస్ మెషీన్లు** : కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్రతి కేంద్రంలో సుమారు రూ.85 లక్షల వ్యయంతో ఐదు డయాలసిస్ యంత్రాలు అందుబాటులోనికి వస్తాయి. వీటి ద్వారా రోజుకు 15 డయాలసిస్ సెషన్లు నిర్వహించే అవకాశం ఉంటుంది. దీంతో దీర్ఘకాలంగా డయాలసిస్ చేయించుకోవాల్సిన రోగులకు సమీప ప్రాంతాల్లోనే చికిత్స పొందే సదుపాయం కలుగుతుంది. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతోపాటు, రోగులు, వారి కుటుంబాలపై ప్రయాణ భారం, ఇతర ఖర్చులు తగ్గుతాయి. ఈ కేంద్రాల ద్వారా అందే సేవలకు ఏడాదికి రూ.11 కోట్ల వరకు వ్యయమవుతుంది. ఇప్పటికే పిఎంఎన్‌డిపి ద్వారా నడుస్తోన్న 61 కేంద్రాల్లో 754 మెషీన్లు పనిచేస్తున్నాయి.

**పెరుగుతున్న వైద్య సేవల వ్యయం** : 2024-25లో ఈ రెండు కేటగిరీల్లో కలిపి డయాలసిస్ సేవలకు గాను ప్రభుత్వం రూ.126.58 కోట్లు వెచ్చించింది. 2025-26 నాటికి ఈ మొత్తం రూ.197.88 కోట్లకు చేరింది. 2026-27లో ఇప్పటి వరకు అయిన వ్యయం రూ.90.09 కోట్లు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కింద ప్రభుత్వ రంగంలో 21, ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో కలిపి 149 డయాలసిస్ కేంద్రాలున్నాయి.

## దేశాభివృద్ధే మనందరి లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యంతో భారత యువత ప్రపంచంలో ఏదైనా సాధించగలదని పేర్కొన్నారు. యువత ఇదే స్ఫూర్తితో ముందుకు సాగితే 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సాంకేతికత, విజ్ఞానానికి ఆధ్యాత్మికతను జోడించి ముందుకు సాగాలని సూచించారు. విజయవాడ ఉత్సవాల వంటి కార్యక్రమాలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను చాటుతాయని అన్నారు.

**తెలుగులో మాట్లాడిన విజయ్** : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ విజయవాడ ఉత్సవ్ వేదికపై తెలుగులో ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. "అందరికీ నమస్కారం. మిమ్మల్ని అందరినీ కలిసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. దీంతో సభలో యువత కేరింతలు మిన్నంటాయి.

నదుల అనుసంధానంపై చంద్రబాబుతో చర్చించేందుకు విజయవాడకు వచ్చినట్లు విజయ్ తెలిపారు. తనను ఆహ్వానించి ఆతిథ్యం ఇచ్చినందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం చంద్రబాబు విజయ్‌ను సాదరంగా ఆహ్వానించి ప్రసంగించాల్సిందిగా కోరారు. కళాకారులకు, కార్యక్రమానికి హాజరైన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## పల్లె బాటలకు ప్రగతి జోరు




(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతమిచ్చే లక్ష్యంతో మొత్తం రూ. 8.91 కోట్లతో ఈ అభివృద్ధి పనులు చేపట్టాం. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక విజ్ఞప్తి మేరకు చేపట్టిన ఈ పనుల్లో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 6.31 కోట్ల వ్యయంతో 2.2 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రహదారిని విస్తరించాం. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల ద్వారా రూ. 2.60 కోట్లతో సెంట్రల్ డివైడర్, వీధి దీపాలు, సుందరీకరణ తదితర పనులు చేపట్టనున్నాం.

ఆత్మకూరు పట్టణ ప్రజలు నిత్యం జాతీయ రహదారి ఎన్‌హెచ్-67కు చేరుకునేందుకు ఈ మార్గంపైనే ఆధారపడేవారు. ఇరుకైన రహదారి, గుంతల కారణంగా స్థానికులు, విద్యార్థులు, రైతులు రాకపోకల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టడంతో జాతీయ రహదారిని తలపించేలా నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ రహదారిని అభివృద్ధి చేశాం. ఈ రహదారి సమీపంలోని ఆలయంలో 50 అడుగుల ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహం కొలువై ఉంది. భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక భావాలకు ప్రతీకగా నిలిచిన ఈ విగ్రహం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, రహదారికి వాయుపుత్ర మార్గ్ అని నామకరణం చేస్తున్నాం.

**పల్లె పండుగతో గ్రామీణ రహదారుల అభివృద్ధి** : రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారులను బలోపేతం చేసేందుకు పల్లె పండుగ 1.0, 2.0 కార్యక్రమాల కింద 9 వేల కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించగా, మరో 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్లకు మంజూరు చేశాం. ఆ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా మరో 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశాం. వ్యవసాయ క్షేత్రాలకు రాకపోకలు సులభతరం చేసేందుకు 161 డొంక రోడ్ల నిర్మాణానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, రైతులు, విద్యార్థులు, స్థానిక ప్రజల ప్రయాణ ఇబ్బందులను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది" అన్నారు.

**వీర్లగుడిపాడు వంతెన నిర్మాణానికి చర్యలు వేగవంతం** : సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కోరగా, ఈ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు, అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. అదేవిధంగా, తాగునీటి సమస్యను ప్రస్తావించగా.. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద ఇప్పటికే రూ. 72 కోట్లతో 391 సింగిల్ విలేజ్ స్కీమ్స్‌ను ముందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు. మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 2,721 పోస్టులతో డిఎస్‌సి నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 906, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 1,205 ఉన్నాయి. ప్రత్యేక విద్య విభాగంలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 150, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 200 ఉన్నాయి. పూర్తి ప్రకటన నవంబరు 3లోపు అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల కానుంది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షకు సంబంధించిన పాఠ్యప్రణాళిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. ప్రస్తుతం ప్రకటించిన ఖాళీలు తాత్కాలికమైనవని, తుది ఖాళీలు, రోస్టర్ వివరాలను పూర్తి ప్రకటనలో వెల్లడిస్తామని విద్యాశాఖ తెలిపింది.

## అమరావతిలో క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్స్‌కు శంకుస్థాపన

- **ప్రపంచ స్థాయి క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా రాజధాని అభివృద్ధి**
- **సుమారు 25 వేల మందికి ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యం: మంత్రి పి. నారాయణ**



**అమరావతి , అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు పడింది. అమరావతి క్వాంటం వ్యాలీలో నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక ట్విన్ టవర్స్ నిర్మాణానికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ మంగళవారం శంకుస్థాపన చేశారు. అత్యాధునిక క్వాంటం సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్రంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

ఉద్దండరాయునిపాలెంలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 11 ఎకరాల స్థలంలో ఐకానిక్ ట్విన్ టవర్స్ నిర్మించనున్నారు. మొత్తం 37,48,847 చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణంతో ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఈ రెండు టవర్లను నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. క్వాంటం వ్యాలీలో మొత్తం ఎనిమిది టవర్లను నిర్మించాలనే ప్రణాళికలో భాగంగా తొలి రెండు టవర్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

క్వాంటం వ్యాలీ ద్వారా రాజధాని ప్రాంతంలో సుమారు 25 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని మంత్రి పి. నారాయణ తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలు, సాంకేతిక సంస్థల ఏర్పాటుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా అమరావతిని గ్లోబల్ టెక్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

రక్షణ, వైద్యం, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు వంటి అనేక కీలక రంగాల్లో క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికత విప్లవాత్మక మార్పులకు దోహదపడుతుందని మంత్రి వివరించారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని ముందుగానే అంచనా వేయడం, నష్టాలను తగ్గించడం వంటి అంశాల్లోనూ ఈ సాంకేతికతకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

క్వాంటం వ్యాలీ కోసం ముఖ్యమంత్రి ప్రణాళిక ప్రకారం 50 ఎకరాల భూమిని కేటాయించినట్లు నారాయణ వెల్లడించారు. మొత్తం ఎనిమిది టవర్ల నిర్మాణానికి సంబంధించిన డిజైన్లు సిద్ధం చేశామని, వాటిలో రెండు టవర్లకు ప్రస్తుతం శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. క్వాంటం వ్యాలీ మిషన్ నిర్వహణ కోసం ప్రత్యేక భవన నిర్మాణం కూడా కొనసాగుతోందని, అది పూర్తయిన అనంతరం అవసరమైన పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

క్వాంటం వ్యాలీ అభివృద్ధితో అమరావతిలో అధునాతన సాంకేతిక రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడటంతో పాటు పరిశోధన, ఉపాధి, పెట్టుబడులకు ఊతం లభించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలు, పరిశోధనా సంస్థలు, నిపుణులను ఆకర్షించేలా మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

## డ్వాక్రా మహిళలకు 'స్త్రీనిధి' ఊతం

- **అర్హులైన సభ్యురాలికి రూ.3 లక్షల వరకు రుణం**
- **48 గంటల్లో మంజూరు.. 11 శాతం వార్షిక వడ్డీ**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా 'స్త్రీనిధి' ద్వారా ప్రత్యేక మహిళా పారిశ్రామికవేత్తల రుణ పథకాన్ని ప్రారంభించినట్లు ఎంఎస్ఎంఈ, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అర్హులైన ప్రతి స్వయం సహాయక సంఘం సభ్యురాలికి రూ. 3 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తామని, ఒక్కో సంఘం నుంచి గరిష్ఠంగా ముగ్గురికి అవకాశం ఉంటుందని మంగళవారం వెల్లడించారు. 48 గంటల్లోనే రుణం మంజూరు చేస్తామని, వార్షిక వడ్డీ 11 శాతం మాత్రమేనని పేర్కొన్నారు.

గత రెండేళ్లలో సుమారు 17.96 లక్షల మంది మహిళలకు రూ.14,467.12 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. డిజిటల్ విధానంలో రూ.4,443.13 కోట్లు వసూలు చేశామన్నారు. గ్రామ సంస్థల కోసం రూ.6 కోట్ల విలువైన 30 వేల బయోమెట్రిక్ పరికరాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. 98 శాతం రికవరీ రేటు నమోదైందని వెల్లడించారు.

**రుణ పరిమితి పెంపు :** స్వయం సహాయక సంఘాల రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.17 లక్షలకు, గ్రామ సంస్థల రుణ పరిమితిని రూ. 1.50 కోట్లకు పెంచినట్లు మంత్రి తెలిపారు. పిల్లల చదువులు, వివాహాల కోసం 4 శాతం వడ్డీ రాయితీతో విద్యా, వివాహ రుణాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఆహార శుద్ధి పరిశ్రమల యూనిట్లకు సబ్సిడీ రుణాలు, గిరిజన ప్రాంతాల మహిళలకు ప్రత్యేక స్వల్పకాలిక రుణాలు అందిస్తామని వివరించారు.

**మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.3 వేల కోట్లు :** ప్రస్తుత ఆర్థిక సంవత్సర లక్ష్యంలో రూ.3 వేల కోట్లను మహిళా పారిశ్రామికవేత్తల రుణాల కోసమే కేటాయించినట్లు మంత్రి తెలిపారు. రుణగ్రహీత మరణిస్తే ఆ కుటుంబానికి అండగా ఉండేందుకు లోన్ ప్రొటెక్షన్, ప్రమాదవశాత్తు మరణ సహాయ పథకాలు వర్తిస్తాయని వెల్లడించారు.

## కొత్తపేట కొండపై పర్యాటక కళ..



- **జాతీయ రహదారికి అనుసంధానంగా నూతన రహదారి**

**కోటబొమ్మాళి, అక్టోబర్ 13(జర్నలిస్ట్ ఫైల్) :** కోటబొమ్మాళి ప్రాంత అభివృద్ధిలో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.5.79 కోట్ల అంచనా వ్యయంతో కొత్తపేట మైక్రో టవర్ కొండకు రహదారులు, తహశీల్దార్ కార్యాలయ పునర్నిర్మాణం, మండల పరిషత్ భవనం పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు.

కొత్తపేటలోని మైక్రో టవర్ కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. కొండ సహజ అందాలకు అనుగుణంగా పర్యాటక సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మైక్రో టవర్ రిపీటర్ స్టేషన్ రహదారికి రూ.85 లక్షలు, కొండపైకి సిమెంట్ రహదారికి రూ.4 కోట్లతో పనులు చేపట్టనున్నారు. కోటబొమ్మాళి తహశీల్దార్ కార్యాలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు, మండల పరిషత్ భవనం పునరుద్ధరణ, సుందరీకరణకు రూ.44 లక్షలు కేటాయించారు. మైక్రో టవర్ కొండ నుంచి జాతీయ రహదారికి నేరుగా అనుసంధానం కల్పించేలా నూతన రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎంపి, ఎమ్మెల్యేల కేసులకు ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఎంపి, ఎమ్మెల్యేల కేసులను విచారించేందుకు ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. విజయవాడలోని ఎనిమిదో అదనపు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును ఈ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టుగా గుర్తించేందుకు హైకోర్టు పరిపాలనాపరంగా తీసుకున్న నిర్ణయాన్ని ఈ నెల 9న న్యాయశాఖకు పంపినట్లు రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ మంగళవారం ధర్మాసనానికి తెలిపారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ వివరాలను నమోదు చేసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం, వీలైనంత త్వరగా ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎంపి, ఎమ్మెల్యేల కేసులను సెషన్స్ కోర్టు కాకుండా మొదట మెజిస్ట్రేట్ కోర్టు విచారించాలన్న సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా కోర్టు ఏర్పాటు చేయాలని వైసిపి సీనియర్ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## తెలుగు రాష్ట్రాల గర్వం.. శ్రీశైలం

(మొదటి పేజీ తరువాయి)

డ్యామ్ నిర్మాణ పటిష్ఠత, జలవిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, సాగు, తాగు నీటి అవసరాలకు అందిస్తున్న సేవలకు అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. శ్రీశైలం జలాశయం దశాబ్దాలుగా భారీ వరదలను తట్టుకుంటూ ప్రజలకు సేవలందిస్తోందని మంత్రి తెలిపారు. ఇది కేవలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాత్రమే కాదని, లక్షలాది మంది తాగునీటి అవసరాలతో పాటు లక్షల ఎకరాల సాగునీటి అవసరాలను తీరుస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు అని వివరించారు. కృష్ణా జలాల వినియోగంలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో విశేషమైన ప్రాధాన్యం కలిగి ఉందన్నారు.

**పట్టిసీమతో రాయలసీమకు ప్రయోజనం** : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో పట్టిసీమ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావడం వల్ల శ్రీశైలం జలాలను రాయలసీమ అవసరాలకు మరింత సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడిందని గొట్టిపాటి పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని అందించడం వల్ల శ్రీశైలం జలాలను రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేందుకు వెసులుబాటు కలిగిందన్నారు. కృష్ణా డెల్టా రైతులకు అవసరమైన నీటిని అందిస్తూనే రాయలసీమ ప్రాంత అవసరాలకూ శ్రీశైలం జలాశయం అండగా నిలుస్తోందని తెలిపారు. అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించడం, ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా నీటిని సద్వినియోగం చేయడంలో ముఖ్యమంత్రి ముందుచూపు స్పష్టంగా కనిపిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

## నిరసనలకు 'నో'.. రామ్‌లీలా బుకింగ్స్ ఫుల్!

(మొదటి పేజీ తరువాయి)

**చారిత్రక ఘట్టాలకు వేదిక :** గతంలో రామ్‌లీలా మైదానం ఉన్న ప్రాంతంలో చెరువు ఉండేది. 1932లో రామ్‌లీలా ప్రదర్శనల నిర్వహణ కోసం దాన్ని పూడ్చి చదును చేయడంతో ఈ పేరు వచ్చింది. అనంతరం రాజకీయ ర్యాలీలు, బహిరంగ సభలకు ఇది ప్రముఖ వేదికగా మారింది.

జమ్మూకశ్మీర్ భారత్‌లో పూర్తిగా విలీనం కావాలని కోరుతూ 1952లో జనసంఘ్ నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ ఇక్కడే సత్యాగ్రహం ప్రారంభించారు. 1971లో పాకిస్థాన్‌పై విజయం అనంతరం అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఈ మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్ మూడుసార్లు ఇక్కడే ప్రమాణ స్వీకారం చేశారు.

దశాబ్దాలుగా అనేక రాజకీయ ఉద్యమాలు, కీలక పరిణామాలకు సాక్షిగా నిలిచిన రామ్‌లీలా మైదానంలో ప్రస్తుతం నిరసనలు నిర్వహించాలంటే భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పరిమిత బుకింగ్ తేదీలు, అనుమతుల ప్రక్రియ కూడా నిరసనకారులకు ఇబ్బందిగా మారుతున్నాయి.

## జల బంధానికి ఇద్దరు సీఎంల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా గోదావరి-కావేరి నదుల అనుసంధానం ఆవశ్యకతను సీఎం చంద్రబాబు సమావేశంలో వివరించారు. నదుల అనుసంధానం కరువుకు శాశ్వత పరిష్కారంగా అభివర్ణించారు. మరోవైపు తెలుగు గంగ ద్వారా చెన్నైకు మరింతగా తాగునీరు విడుదల చేయాలని సీఎం విజయ్ కోరారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా జలాలు తగ్గడం, తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొన్నప్పటికీ చెన్నయ్ దాహార్తి తీర్చే విషయంలో ఏపీ ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే 4.08 టీఎంసీల నీటిని చెన్నై నగరానికి విడుదల చేసినట్టు సీఎం చంద్రబాబు చెప్పారు. నీటి లభ్యత, అవసరాలకు అనుగుణంగా మరికొంత నీటిని విడుదల చేయడంపైనా ఆలోచన చేస్తామని చెప్పారు.

## కేంద్ర మంత్రి పదవికి ఎల్.మురుగన్ రాజీనామా!

(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడులో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర రాజకీయాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి తన రాజీనామా లేఖను సమర్పించినట్లు సమాచారం.

**పార్టీ బలోపేతమే లక్ష్యం :** తమిళనాడులో పార్టీని క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా బలోపేతం చేయడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని మురుగన్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. రాబోయే ఎన్నికలు, రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీని గ్రామస్థాయిలో ప్రజలకు చేరువ చేయడంపై దృష్టి సారించాలని భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో భాజపా బలోపేతానికి పూర్తిస్థాయిలో పనిచేయాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ప్రధాని మోదీకి కృతజ్ఞతలు :** కేంద్ర మంత్రివర్గంలో పనిచేసే అవకాశం కల్పించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, జాతీయ నాయకత్వానికి మురుగన్ కృతజ్ఞతలు తెలిపినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తన వంతు కృషి చేసినట్లు పేర్కొన్నట్లు తెలుస్తోంది.

కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో మురుగన్ త్వరలోనే తమిళనాడు రాజకీయాల్లో పూర్తిస్థాయిలో క్రియాశీలం కానున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పార్టీ బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించే అవకాశముందని భావిస్తున్నాయి.

# ఓట్లు వేసి గెలిపించిన రైతులనే వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**– అధికారుల వేధింపులతో రైతు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు**

**– మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి..**

**వికారాబాద్, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓట్లు వేసి ప్రభుత్వాన్ని గెలిపించిన రైతులనే కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తోందని, రైతుల భూములు తీసుకోవడం, పరిహారం చెల్లించడంలో జాప్యం చేయడం, అధికారుల ద్వారా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. కొడంగల్ మండల్ హకీంపేట్ గ్రామానికి చెందిన రైతు పూజ వెంకటయ్య (54) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మిషన్ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆసుపత్రికి చేరుకుని బాధిత రైతును పరామర్శించారు. ఈసందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. రైతు వెంకటయ్యకు జరిగిన అన్యాయంపై ఆరా తీశారు. గ్రామానికి చెందిన రైతుల భూములను ప్రభుత్వం ఎకరానికి రూ.23 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని ఒప్పందం చేసుకుని తీసుకుందని గ్రామస్తులు తెలిపారు, అయితే వెంకటయ్యకు సంబంధించిన భూమి విషయంలో సమస్య తలెత్తడంతో ఆయన కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తన భూమికి సంబంధించి న్యాయస్థానం నుంచి స్టే తెచ్చుకున్నందుకే అధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. వెంకటయ్య తన భూమిలో పంట సాగు చేసుకోగా, పంట చేతికి వచ్చే సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పంట నష్టపోయినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ఒకవైపు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందకపోవడం, మరోవైపు పంటకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, అధికారులను సంప్రదించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై వెంకటయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, అధికారులు వారిని ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమన్నారు. భూమికి సంబంధించిన వివాదం కోర్టు పరిధిలో ఉన్నప్పుడు న్యాయస్థానం ఆదేశాలను గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. పరిహారం చెల్లించాల్సి ఉంటే వెంటనే చెల్లించి రైతు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారికి ఫోన్ చేసి రైతు వెంకటయ్య సమస్యను వివరించారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, ఇలాంటి పరిస్థితులు రైతులను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పొట్టకొట్టే ప్రభుత్వం ఎప్పటికీ ప్రజల మద్దతును నిలబెట్టుకోలేదని వ్యాఖ్యానించారు. రైతులను వేధించే విధానాలకు స్వస్తి పలకాలని, అధికారుల తీరు మారాలని హితవు పలికారు. రైతుల ఆత్మహత్యాయత్నాలకు దారితీస్తున్న పరిస్థితులపై ప్రభుత్వం సమాధానం



చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోవైపు బాధిత రైతు వెంకటయ్య కుమార్తె మాట్లాడుతూ తమ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తన తమ్ముళ్లు ఇంటర్మీడియట్ చదువుతు న్నారని, పంట చేతికి వచ్చే సమయంలో ఎదురైన సమస్యలు, తన తండ్రిపై ఒత్తిడి కారణంగానే ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్ప డ్డారని ఆరోపించారు. తన తండ్రికి ఏదైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తమ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకో వాలని కోరారు. కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా తమ తండ్రిని ఇబ్బందులకు గురిచేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితకుటుంబానికి న్యాయంజరిగేలా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, వికారాబాద్ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓఎల్ఎక్స్ ద్వారా మొబైల్ ఫోన్ మోసాలు

**– నిందితుడి అరెస్ట్ – తెలంగాణలో 17 కేసులతో సంబంధం..**

**– రూ.12.80 లక్షల మేర మోసం చేసినట్లు ప్రాథమిక అంచనా**

**శేర్లింగంపల్లి, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓఎల్ఎక్స్ ద్వారా ఖరీదైన మొబైల్ ఫోన్ల విక్రయాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రాథమిక విచారణలో నిందితుడికి తెలంగాణలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 17 కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసుల్లో బాధితులు సుమారు రూ.12.80 లక్షలు నష్టపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు.

నకిలీ ప్రకటనలతో మోసాలు.. పోలీసుల వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన బత్తుల శ్రీరామ్ (31) ఓఎల్ఎక్స్‌లో ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్, ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్, శాంసంగ్ గెలాక్సీ ఎస్25 అల్ట్రా వంటి ఖరీదైన మొబైల్ ఫోన్ల ఫొటోలను గూగుల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని విక్రయానికి ఉన్నట్లు నకిలీ ప్రకటనలు పెట్టేవాడు. వేర్వేరు మొబైల్ నంబర్లు, తప్పుడు పేర్లతో కొనుగోలుదారులను సంప్రదించేవాడు. తాను కేవలం మధ్యవర్తినని, ఫోన్‌ను తన సోదరుడు విక్రయిస్తున్నాడని నమ్మించేవాడు. కొనుగోలుదారులు ఫోన్‌ను పరిశీలించిన తర్వాత డబ్బులు చెల్లించేవారు. నగదు అందిన వెంటనే నిందితుడు తన ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయేవాడు. ఇతరులకు చెందిన యూపీఐ ఖాతాలు, క్యూఆర్ కోడ్లు, బ్యాంకు ఖాతాల ద్వారా డబ్బులు స్వీకరించినట్లు విచారణలో వెల్లడైంది. కొంత మొత్తాన్ని తన బ్యాంకు ఖాతాలో నగదు రూపంలో జమ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. మోసం ద్వారా వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఖర్చు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

17 కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తింపు.. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 1067/2026 కింద భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 318(4), 319(2), ఐటీ చట్టంలోని సెక్షన్ 66–ఐ ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితుడిని అక్టోబర్ 11న అరెస్ట్ చేశారు. షంషాబాద్, వనస్థలిపురం, సిద్దిపేట వన్‌టౌన్, చొప్పదండి, పేట్‌బషీరాబాద్, అల్వాల్, ఎల్‌బీనగర్, జీడిమెట్ల, ఆదిబట్ల, ఉప్పల్, మాదాపూర్, గోపాలపురం, సూరారం తదితర పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులతో పాటు రాయదుర్గం కేసుతో కలిపి మొత్తం 17 కేసులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితుడి నుంచి యాపిల్ ఐఫోన్ 15 ప్రో మ్యాక్స్, రియల్‌మీ జీటీ 6టీ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మోసపోయిన బాధితుల వివరాలు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించి నష్టపోయిన మొత్తం ఎంతన్నది నిర్ధారించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. నిందితుడు మరిన్ని మోసాలకు పాల్పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

పోలీసుల పర్యవేక్షణలో కేసు ఛేదన.. కూకట్‌పల్లి జోన్ అదనపు డీసీపీ ఎం. సుదర్శన్ పర్యవేక్షణలో, మాదాపూర్ డివిజన్ ఏసీపీ సీహెచ్ శ్రీధర్ మార్గదర్శకత్వంలో, రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ టీ. భూపతి సూచనల మేరకు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె. రామిరెడ్డి, ఆయన బృందం కేసును దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని అదనపు డీసీపీ అభినందించారు.

ఆన్‌లైన్ కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి.. ఓఎల్ఎక్స్ వంటి ఆన్‌లైన్ వేదికలపై వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు విక్రేత గుర్తింపు, ఫోన్ నంబర్, ఇతర వివరాలను ధ్రువీకరించుకోవాలని పోలీసులు సూచించారు. వస్తువుతో సంబంధం లేని వ్యక్తుల బ్యాంకు ఖాతాలు లేదా యూపీఐ ఐడీలకు డబ్బులు పంపించే ముందు పూర్తి వివరాలు నిర్ధారించుకోవాలన్నారు. తక్కువ ధరకు ఖరీదైన వస్తువులు లభిస్తాయనే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఆన్‌లైన్ ఆర్థిక మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.

# ప్రజలకు అందుబాటులోనే నిర్ణయాలు

**హైదరాబాద్, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్టీసీ, మెట్రో కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను, వాస్తవ పరిస్థితులను సమీక్షిస్తున్నామని వెల్లడించారు మంత్రి పొన్నం ప్రభాకర్.. ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ఛార్జీలను పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం అమల్లోకి తీసుకొచ్చిన కామన్ పాస్ ధరలు రోజువారీ పాస్‌కు రూ.400 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్టీసీ వాటా రూ.100గా ఉంది. అదేవిధంగా నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.7,000, ఆర్టీసీ వాటా రూ.1,500గా నిర్ణయించారు. అయితే ఈ ఛార్జీలు సామాన్య ప్రజలకు భారంగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు ఛార్జీలను పునఃపరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ధరలను నిర్ణయించే అంశంపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆర్టీసీ, మెట్రో సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకునేలా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రయాణికులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా, వారి అవసరాలకు అనుగుణంగా, సౌకర్యవంతమైన ధరలతో కామన్ పాస్ విధానం అమలయ్యేలా తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రజా రవాణాను మరింత అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ లక్ష్యం కాదని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

# ప్రజల కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకే ఉంది..

**హైదరాబాద్, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టమని, ప్రజలకు సేవ చేయడంతోపాటు వారి ప్రాణాలను కాపాడే అరుదైన అవకాశం పోలీసు శాఖలో పనిచేసేవారికి లభిస్తుందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. తెలంగాణలో నాలుగు కోట్ల జనాభాలో సుమారు 90 వేల మందికే పోలీసు యూనిఫాం ధరించే అవకాశం ఉందని, ఇది మొత్తం జనాభాలో 0.3 శాతం మాత్రమేనని వివరించారు. ప్రతిరోజూ కనీసం 50 మంది కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకు ఉంటుందని పేర్కొన్నారు. నిజాయితీ, నైతిక విలువలను విస్మరించరాదని, కుల, మత, రాజకీయ రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2014 తర్వాత పూర్తిస్థాయిలో శిక్షణ ముగించుకుని బయటకు వస్తున్న తొలి డీఎస్పీ బ్యాచ్ కావడంతో దీనికి ప్రత్యేకత ఉందన్నారు. 44 వారాలపాటు చట్టాలు, దర్యాప్తు విధానాలు, ఔట్‌డోర్ శిక్షణ, క్రీడల్లో శిక్షణ పొందిన అధికారులను అభినందించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసిస్తూ, అకాడమీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని కారణాల వల్ల ముఖ్యమంత్రి పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారని పేర్కొన్నారు.

**30 ఏళ్ల వృత్తి జీవితానికి పునాది :** పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా చేసే ప్రమాణం అధికారుల 30–35 ఏళ్ల వృత్తి జీవితానికి మార్గదర్శకంగా నిలవాలని డీజీపీ సూచించారు. రాజ్యాంగం పట్ల నిబద్ధతతో, ప్రజలకు నిజాయతీగా, రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహిస్తానని చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. అకాడమీలో శిక్షణ పూర్తయిన తర్వాత మరో 46 వారాలపాటు క్షేత్రస్థాయిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ దశలోనూ అదే శ్రద్ధ, క్రమశిక్షణ, నిజాయతీతో వ్యవహరించాలని సూచించారు. తన 35 ఏళ్ల పోలీసు అనుభవంలో నేర్చుకున్న అంశాలను గతంలో డీఎస్పీలతో నిర్వహించిన ముఖాముఖిలో వివరించానని, నాయకత్వ లక్షణాల ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేస్తున్నానని చెప్పారు.

**నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి : డీజీపీ..** ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. మీరు నాయకులుగా ఎంపికయ్యారు.. మీ నాయకత్వ లక్షణాలను విధుల్లో నిరూపించుకోవాలని అన్నారు. ధైర్యం, దార్శనికత, నైతిక విలువలు, నిష్పాక్షికత, బృంద స్ఫూర్తి, సంభాషణ నైపుణ్యాలు, కష్టపడే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆలోచనలు, వినయం.. ఈ పది లక్షణాలను ప్రతి అధికారి అలవర్చుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో నైతిక విలువలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించరాదన్నారు.

**నేరాల తీరు మారింది.. పోలీసింగ్ మారాలి..:** తాము యూనిఫాం ధరించిన రోజుల్లో నక్సలిజం ప్రధాన సవాలుగా ఉండేదని, ఆ సమస్యను పోలీసులు సమర్థంగా ఎదుర్కొన్నారని డీజీపీ గుర్తు చేశారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, రోడ్డు భద్రత, ఇతర కొత్త తరహా సవాళ్లు పోలీసుల ముందున్నాయని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీసు శాఖలో సంస్థాగత మార్పులు చేపట్టామని చెప్పారు. గ్రేహౌండ్స్ తదితర విభాగాల పునర్వ్యవస్థీకరణతో పాటు ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీజీ ఫాస్ట్, టీజీ స్పార్క్ వంటి విభాగాలను బలోపేతం చేసి కొత్త సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు కూడా ఈ మార్పులకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఫిట్‌నెస్, స్మార్ట్‌నెస్ తప్పనిసరి.. పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం, చురుకుదనం, వృత్తిపరమైన నైపుణ్యాలు అత్యంత ముఖ్యమని డీజీపీ అన్నారు. యూనిఫాం ధరించిన తొలిరోజు ఉన్న ఉత్సాహం, క్రమశిక్షణ, ఫిట్‌నెస్ 30 ఏళ్ల తర్వాత కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. పోలీసు పాసింగ్ అవుట్ పరేడ్‌లో బెల్టుపై ఉన్న హోల్ (రంధ్రం) 30 ఏళ్ల సర్వీసు పూర్తయ్యే వరకు, ఉద్యోగ విరమణ చేసేంతవరకు అలాగే ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, సమర్థవంతమైన నాయకులుగా ఎదగాలని డీఎస్పీలకు పిలుపునిచ్చారు.

**112 సంఖ్యకు ప్రత్యేక అనుబంధం: అకాడమీ డైరెక్టర్ :** తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ.. 112 సంఖ్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ప్రజల అత్యవసర సేవల కోసం తెలంగాణ పోలీసు వ్యవస్థలో 112 సేవలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పుడు 112 మంది డీఎస్పీలు ప్రజాసేవలోకి అడుగుపెట్టడం విశేషమని పేర్కొన్నారు. వీరిలో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు ఉన్నారు. మల్టీజోన్–1 నుంచి 51 మంది, మల్టీజోన్–2 నుంచి 61 మంది ఎంపికయ్యారు. విద్యార్హతల పరంగా 79 మంది డిగ్రీ పట్టభద్రులు, 31 మంది పీజీ పూర్తి చేసినవారు ఉన్నారు. మరో ఇద్దరిలో ఒకరు ఎంబీబీఎస్, మరొకరు బీడీఎస్ పట్టా పొందారు. ఈ బ్యాచ్‌లో గతంలో రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసినవారు 45 మంది, కేంద్ర ప్రభుత్వంలో పనిచేసినవారు 12 మంది ఉండగా.. కొత్తగా ఉద్యోగ జీవితంలోకి అడుగుపెడుతున్నవారు 55 మంది ఉన్నారు. గతంలో పోలీసు శాఖలో ఎస్సైలుగా పనిచేసిన నలుగురు ప్రస్తుతం డీఎస్పీలుగా ఎంపికయ్యారు. శిక్షణ పొందుతూనే 2026లో యూపీఎస్సీ పరీక్షల్లో జి.సృజన 55వ ర్యాంకు, డి.ప్రవీణ్‌కుమార్ 795వ ర్యాంకు సాధించడం విశేషం. ఆరు వారాల ఫౌండేషన్ శిక్షణను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో అందించినట్లు చెప్పారు. అకాడమీ నినాదమైన నాలెడ్జ్, స్కిల్, ఆటిట్యూడ్ ఆధారంగా అధికారులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. క్షేత్రస్థాయి అనుభవం కల్పించేందుకు మేడారం జాతర, వినాయక చవితి, ఇతర ప్రధాన కార్యక్రమాల్లో విధులు నిర్వహించే అవకాశం కల్పించామన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఈగల్ వంటి విభాగాలతో శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. పోలీసుల విధి ప్రజలకు న్యాయం చేయడమేనని, వారి పనితీరును బట్టే ప్రజలు వారిని అంచనా వేస్తారని అన్నారు.



**నేహా అగర్వాల్‌కు సీఎం రివాల్వర్.....9 విభాగాల్లో ఉత్తమ ప్రతిభకు ట్రోఫీలు, పతకాలు..** పోలీస్ శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నేహా అగర్వాల్ ముఖ్యమంత్రి రివాల్వర్‌తో పాటు మరో మూడు పురస్కారాలను అందుకున్నారు. బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌కు సీఎం రివాల్వర్, రాజా బహదూర్ వెంకట రామారెడ్డి బంగారు పతకం, కోన రామచంద్రారెడ్డి స్మారక బంగారు పతకం, ఇండోర్ సబ్జెక్టుల్లో ప్రతిభకు హోంమంత్రి బేటన్ ఆమెకు లభించాయి. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి బంగారు పతకంతో పాటు రూ.5,000 నగదు బహుమతి కూడా అందుకున్నారు. ఇతర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారిలో ఔట్‌డోర్ సబ్జెక్టుల్లో ఎల్. శ్రీకాంత్ డీజీపీ ట్రోఫీ, ఫైరింగ్‌లో టీ. జాకబ్ అభిషేక్ ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో డి. చందన, క్రిమినాలజీలో చి. ఆది శేషు రెడ్డి ఎన్ఐసీఎఫ్ఎస్ పతకాలు సాధించారు. దర్యాప్తులో ఉత్తమ ప్రతిభకు ఆర్. సాయి కిరణ్ రెడ్డి డైరెక్టర్ పతకాన్ని దక్కించుకున్నారు.

**చట్టాల నుంచి సైబర్ నేరాల దర్యాప్తు వరకు..** 44 వారాల సంస్థాగత శిక్షణలో భాగంగా ఇండోర్, అవుట్‌డోర్ అంశాలను రెండు సెమిస్టర్లుగా విభజించారు. ఇండోర్ శిక్షణలో పోలీసు వ్యవస్థ, నేరశాస్త్రం, నేరాల నివారణ, మానవ హక్కులు, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినియం, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఫోరెన్సిక్ సైన్స్, నాయకత్వం, నిర్వహణ వంటి అంశాలను బోధిస్తున్నారు. శారీరక నేరాలు, ఆస్తి సంబంధ నేరాలు, సైబర్ నేరాలు, ఆర్థిక మోసాల దర్యాప్తు విధానాలపైనా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అంతర్గత భద్రత, శాంతిభద్రతల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నారు.

**ఆయుధ వినియోగం.. క్షేత్రస్థాయి నైపుణ్యాలు..** అవుట్‌డోర్ శిక్షణలో శారీరక వ్యాయామాలు, డ్రిల్, పరేడ్, ఆయుధ వినియోగం, కాల్పులు, ఫీల్డ్‌క్రాఫ్ట్, మ్యాప్ రీడింగ్, వ్యూహాత్మక విధానాలు, వీఐపీ భద్రత, పేలుడు పదార్థాలు, ఐఈడీల నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. స్విమ్మింగ్, ప్రథమ చికిత్స, అంబులెన్స్ డ్రిల్, వాహనాల డ్రైవింగ్, విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక చర్యలు, క్రీడలకూ ప్రాధాన్యం ఇచ్చారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీనియర్ పోలీసు అధికారులు, రిటైర్డ్ పోలీసు అధికారులు, అకాడమీ సిబ్బంది, శిక్షణ పొందిన డీఎస్పీల కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రశాతంగా ఓపెన్ ఇంటర్, పదోతరగతి పరీక్షలు

ఇంటర్‌లో 40మంది, పదిలో 69మంది హాజరు

మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు : డిఈఓ శంభుప్రసాద్



**భద్రాద్రికొత్తగూడెం అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వ హించిన ఓపెన్ ఇంటర్మీడియట్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.శంభుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు మొత్తం 47మంది అభ్యర్థులకు గాను 40మంది హాజరుకాగా, ఏడుగురు గైర్హాజరయ్యారు. పదో తరగతి పరీక్షలకు 90 మందికి గాను 69మంది హాజరయ్యారు. మరో 21మంది పరీక్షలకు హాజరు కాలేదని తెలిపారు.పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ రెండు పరీక్షా కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మరో రెండు కేంద్రాలను తనిఖీ చేశారు.జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

## ఓట్ చోరీపై ఆందోళన

టిపిసిసి పిలుపు మేరకు ఛలో ఢిల్లీ : నూతిసత్యనారాయణగౌడ్




**ఖమ్మం అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటు చోరీపై ఇండియా కూటమి ఆందోళనలో భాగంగా టీపీసీసీ పిలుపు మేరు ఛలో ఢిల్లీప్రజాస్వామ్యం కోసం మార్చ్ పేరిట కనాట్ ప్లేస్ నుంచి సుప్రీం కోర్టు వరకు సోమవారంభారీ ర్యాలీ నిర్వహించార.ఈ ర్యాలీలో పాల్గనేందుకు ఇతర ముఖ్య నాయకులతో కలిసి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతిసత్యనారాయణగౌడ్ ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున్‌ఖర్గే, లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు టమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపు మేరకు ఢిల్లీలో ర్యాలీలో పాల్గన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌పార్టీ ఇండియాకూటమి భాగస్వామ్య పార్టీలతో కలిసిచేపట్టిన ఉద్యమం కేవలం రాజకీయ ప్రజయోజనాల కోసం కాదని, దేశ పౌరుల ప్రాథమిక ఓటు హక్కును ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడానికి అని,రాష్ట్రపతితో పాటు వివిధ రాజ్యాంగ వ్యవస్థల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని అనంతరం న్యాయస్థానాల పరిధిలోని అంశాలను పరిగణనలోకి తీసుకోని ఇండియా కూటమి ఆధ్వర్యంలో శాంతియుత గాంధేయ మార్గంలో ఈ సత్యాగ్రహాన్ని నిర్వహిస్తున్నారని ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకొనేందుకు దేశప్రజలు అందరూ ఈ పోరటానికి మద్దతు తెలపాలని, పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్రమంత్రి వర్గసభ్యులు, శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు తెలంగాణ రాష్ట్ర ముఖ్య నాయకులు, రాష్ట్ర కార్పొరేషన్‌ప్రస్తుత మాజీ చైర్మన్లు, వేజెండ్లసాయికుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## భద్రాచలం రోడ్డు పేరు మార్చాలి

కొత్తగూడెం రైల్వేస్టేషన్‌గా నామకరణం చేయాలి

ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రతిభింబించేలా స్టేషన్‌పేరు ఉండాలి : ఎమ్మెల్యే



**కొత్తగూడెం అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాచలం రోడ్డు రైల్వేస్టేషన్ పేరును తక్షణమే కొత్తగూడెంరైల్వే స్టేషన్‌గా మార్చాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనే జర్‌లకు ఎమెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఇద్దరు రైల్వేఉన్నతాధికారులకు సోమవారం లేఖలు పంపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వే స్టేషన్ పూర్తిగా పట్టణం నడిబడ్డున ఉన్నప్పటికీ భద్రాచలం రోడ్డు పేరుతో పిలవడం వల్ల ప్రయాణికుల్లో తీవ్ర గందరగోళంనెలకొంటోందన్నారు. భద్రా చలం పట్టణం ఈ స్టేషన్‌కు చాలా దూరంలో ఉందని, కొత్తగూడెం మాత్రమే ఈ రైల్వే సేవల ద్వారా నేరుగా అనుసంధానమైందన్నారు. ప్రస్తుత పేరు ఇక్కడి భౌగోళిక వాస్తవికతలకు ఏమాత్రం సరిపోవడం లేదని స్పష్టం చేశారు. ప్రాంతీయ అస్తిత్వాన్ని,ప్రజా ఆకాంక్షల ను ప్రతిభింభించేలాస్టేషన్ పేరును కొత్తగూడెంగా మార్చాల్సిన బాధ్యత రైల్వే శాఖపై ఉందన్నారు. కొత్తగూడెంజిల్లా ప్రజల సౌకర్యార్థం ఈ ప్రతిపాదనను పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రైల్వే ఉన్నతాధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రాచన్నగూడెం పంచాయతీ సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన సర్పంచ్ మడకం విజయ



**ములకలపల్లి అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** రాచన్న గూడెం పంచాయతీ సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ సర్పంచ్ మడకం విజయ సోమవారం కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందచేశారు.మండలంలోని జగన్నాథపురం రైతు వేదికలో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌కు వచ్చిన కలెక్టర్‌కు రాచన్నగూడెంలోని పంచాయతీ పరిధిలో ప్రజలు ఎదు ర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా రాచన్నగూడెం పంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి రావాల్సినటు వంటి నిధులుసాంకేతిక లోపంతో నిలిచిపోయాయని తద్వారా అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులకుప్రాధాన్యతనిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు. పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, వీటి ధీపాలు, వంటి అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. పంచాయతీ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం సహకరించి ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## 35శాతం లాభాల్లో వాటాకోసి సిఐటియు నిరసన



**కొత్తగూడెంసింగరేణి అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** 2025– 26సంవత్సరానికి సంబంధించి వాస్తవ లాభాలు ప్రకటించి 35 శాతం వాటా చెల్లిం చాలని సింగరేణిప్రధాన కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ప్లేకార్డులుప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో పాల్గని ఈసందర్భంగా మాట్లాడుతూ దసరా,దీపావళి పండుగలు వస్తున్న నేపథ్యంలో కార్మిక కుటుంబాలు లాభాల్లో ప్రకటన కోసం వారికి వచ్చే వాటా కోసం ఎదురు చూస్తున్నారన్నారు. సింగరేణి యాజమాన్యం, తెలంగాణరాష్ట్రప్రభుత్వం వాటా ప్రకటించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని, దీని వల్ల కార్మికుల్లో చాలా అసంతృప్తి నెలకొందన్నారు. బొగ్గు ఉత్పత్తిలో పర్మినెంట్ కార్మికులతోపాటు కాంట్రాక్టు కార్మికులకుకూడా 20శాతం వాటా చెల్లింపు చేయాలని జిఎం పర్సనల్ ఐఆర్‌పిఎం కిరణ్‌కుమార్‌కి వినతిపత్రాన్ని అందచేశారు.సింగరేణికి సంబంధివంచిన బొగ్గు, కరెంటు డబ్బులు, ట్రాన్స్కో& జెన్కో ద్వారా బకాయిలు దాదాపు 56వేల కోట్లు రాకపోవడం వల్ల సింగరేణి సంస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడింది. కంపెనీ లావాదేవీలు, కార్మికుల సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతుందనికాబట్టి వెంటనే ఈసమస్య పరిష్కారంకు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజె.రమేష్, రమేష్, కొత్తపల్లి రమేష్‌బాబు, గడల నరసింహారావు, శ్రీరామ్‌మూర్తి, పివి.లక్ష్మీనారాయణ, మాతంగి రాజేష్, జి.సక్రు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై సీఎంసీ కొరడా

**– 16 నిర్మాణాలు గుర్తింపు.. 14 కూల్చివేతలు**

**శేర్లింగంపల్లి, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు. మూడు జోన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 16 అనధికార నిర్మాణాలను గుర్తించగా, 14 నిర్మాణాలను కూల్చివేశారు. మరో రెండు నిర్మాణాలకు నోటీసులు జారీ చేయడంతో పాటు, ఒక అనధికార నిర్మాణాన్ని సీజ్ చేశారు. జోన్ల వారీగా చేపట్టిన కూల్చివేతల్లో సెరిలింగంపల్లి జోన్‌లో నాలుగు, కూకట్‌పల్లి జోన్‌లో నాలుగు, కుత్బుల్లాపూర్ జోన్‌లో ఆరు నిర్మాణాలను కూల్చివేశారు. భవన నిర్మాణ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనధికార నిర్మాణాలను నియంత్రించడంతో పాటు, నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు సీఎంసీ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కొనసాగిస్తున్నారు. గుర్తించిన నిర్మాణాలపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సీఎంసీ వెల్లడించింది.

# యువతే మార్పుకు పునాది..

- విద్యావంతుల మౌనం సమాజానికి చేటు..
- చదువుకున్నవారి నిర్లిప్తతతోనే అనర్హులు అందలమెక్కుతున్నారు..
- కాంగ్రెస్ మార్క్ పాలనపై పట్టభద్రుల తిరుగుబాటుకు వేళైంది..
- కేటీఆర్ దార్శనికతతో హైదరాబాద్‌కు భారీ పెట్టుబడులు..
- 20 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు..
- రేవంత్ రెడ్డి చేతగానితనంతో హైదరాబాద్ ఖ్యాతి నాశనం..
- అర్హులైన ప్రతి పట్టభద్రుడు దరఖాస్తు-18 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలి..
- హైదరాబాద్ - మహబూబ్‌నగర్ - రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షలో దాసోజు శ్రవణ్ పిలుపు..

**హైదరాబాద్, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** చరిత్రలో ఏ గొప్ప ఉద్యమమైనా, ఏ విప్లవాత్మక మార్పు అయినా యువత భాగస్వామ్యంతోనే సాధ్యపడింది. సమాజంలో ప్రతి మార్పునకు యువకులే అసలైన పునాది అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ డా.దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు. రాబోయే హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటు నమోదు, గెలుపు వ్యూహాలపై ఖైరతాబాద్ నియోజకవర్గం సోమాజిగూడ విభాగం మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, బీఆర్ఎస్వీ నాయకుడు మధుకర్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టభద్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. దాసోజు శ్రవణ్ ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై దిశానిర్దేశం చేశారు.

**ఓటు నమోదుపై నిర్లిప్తత వద్దు :** మహాత్మా గాంధీ అయినా, నెహ్రూ, భగత్ సింగ్ ఇంకా అనేక మంది స్వాతంత్ర్య పోరాట యోధులు తమ చిన్న వయస్సులోనే ప్రజా పోరాటాలకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు కూడా తన యువదశలోనే రాజ్యాంగ బద్ధమైన రాజకీయ పోరాటాల్లోకి వచ్చి చరిత్ర సృష్టించారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత విద్యావంతులైన యువతలో రాజకీయాలు, ఓటింగ్ పట్ల నిర్లిప్తత ఆందోళన కలిగిస్తోందన్నారు. గత ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో కేవలం 8,000 ఓట్లు మాత్రమే నమోదు కావడం, ఓటింగ్ శాతం చాలా తక్కువగా ఉండటం విచారకరమ న్నారు. నిరక్షరాస్యులు బాధ్యతగా ఓటు వేస్తుంటే, చదువుకున్న విద్యావంతులు మాత్రం ఎన్నికల రోజును కేవలం ఒక సెలవు దినంగా భావించి ఇతర పనుల్లో గడపడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. మహానగర హైదరాబాద్ వ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని పేర్కొన్నారు.



**ఓటు హక్కు ఒక శక్తివంతమైన ఆయుధం :** మన రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఒక శక్తివంతమైన ఆయుధం లాంటిదని, అర్హత కలిగిన ప్రతీ పట్టభద్రుడు విధిగా దరఖాస్తు-18 పూరించి ఓటరుగా నమోదు చేసుకోవాలని అభ్యర్థించారు. "విద్యావంతులు ఓటు హక్కును వినియోగించుకోకపోతే అనర్హులు అందలమెక్కుతారు. అలాంటి వారి వల్ల సమాజానికి, నిరుద్యోగులకు ఎలాంటి ప్రయోజనమూ ఉండదు" అని హెచ్చరించారు.

సమాజంలో మార్పు రాత్రికి రాత్రే సాధ్యపడదని, దాని కోసం విద్యావంతులుగా నిరంతరం శ్రమించడం మన ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. మన రాజ్యాంగ సూత్రాలను, హక్కులను మర్చిపో వడమే నేటి అన్ని సమస్యలకు మూలకారణమని ఉద్ఘాటించారు.

**కేటీఆర్ దార్శనికత వర్సెస్ రేవంత్ విధ్వంసం :** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి కేటీఆర్ నాయకత్వంలో అంతర్జాతీయ నగరంగా ఎదిగిన హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలబెట్టామని పేర్కొన్నారు. కేటీఆర్ దార్శనికత, సంస్కరణల వల్ల ప్రపంచ ప్రఖ్యాత సమాచార సాంకేతిక, ఔషధ దిగ్గజ సంస్థలు నగరానికి తరలివచ్చి భారీగా పెట్టుబడులు పెట్టాయని, తద్వారా సుమారు 20 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు యువతకు లభించాయని గుర్తు చేశారు. కానీ నేడు రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, తుగ్లక్ మార్క్ పాలన వల్ల హైదరాబాద్ ఖ్యాతి సర్వనాశనమైందని మండిపడ్డారు. కొత్త పెట్టుబడులు రాకపోగా, ఉన్న సంస్థలు కూడా పక్క రాష్ట్రాలకు తరలిపోయే దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి - కాంగ్రెస్ వైఫల్యాలు :** నాటి ఉద్యమాల్లో యువత ఆత్మార్పణలు చేసి, వీరోచితంగా పోరాడటం వల్లే స్వరాష్ట్రం సిద్ధించిందని, కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందని చెప్పారు. నేడు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని మళ్లీ నిర్వీర్యం చేస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి కనీసం ఒక స్పష్టమైన ఉపాధి విధానం కూడా లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఊసే లేదన్నారు. విద్యార్థుల బోధనా రుసుముల రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మళ్లీ విద్యుత్ కోతలు, తాగు/సాగునీటి ఎద్దడి మొదలైందని విమర్శించారు. ఎల్ నినో వాతావరణ మార్పుల ప్రభావంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై, నిరుద్యోగ సమస్యలపై మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని దాసోజు శ్రవణ్ పిలుపునిచ్చారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా విద్యావంతులు, పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ ఆధిక్యంతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సోమాజిగూడ, ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, నియోజకవర్గ పరిధిలోని పెద్ద సంఖ్యలో పట్టభద్రులు, యువకులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి..

- నిర్ణీత గడువులో నాణ్యమైన సేవలు అందించాలి..
- అధికారులకు అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ ఆదేశాలు..

**నల్గొండ అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** నల్గొండ ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి అందే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి, నాణ్యమైన రీతిలో వేగంగా పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధితులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని సూచించారు. సోమవారం నల్గొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో నమ్మకంతో ప్రజావాణికి వస్తుంటారని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లా అధికారులు తమ శాఖలకు సంబంధించి రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో అందిన దరఖాస్తులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని సూచించారు. వీలైనంత వరకు క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా కారణంతో దరఖాస్తును తిరస్కరించాల్సి వస్తే, అందుకు గల స్పష్టమైన కారణాలను దరఖాస్తుదారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రతి వారం శాఖలవారీగా ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని జవాబుదారీతనంతో నిర్వహిస్తూ ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. అలాగే, వివిధ శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించిన వివరాలను మంగళవారంలోపు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.



**125 దరఖాస్తుల స్వీకరణ..** సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 68 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 57 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 125 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి డీఆర్ఓ దశరథ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలి

- ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి
- ప్రజావాణిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్..
- మండలంలోని 230 చెరువుల నీటి నిల్వలపై ఆరా..

**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజవాణికి హాజరైన వివిధ శాఖల అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందచేసి నిబంధనలప్రకారం తగిన చర్యలు తీసుకోని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం మండలంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంపై తాగునీటి సరఫరా, చెరువుల నీటి నిల్వలు, వ్యవసాయ పరిస్థితులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. మిషన్ భగీరథ అధికారులను తాగునీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇరిగేషన్ అధికారుల ద్వారా మండలంలోని 230 చెరువులనీటి నిల్వల వివరాలను తెలుసుకున్నారు. గత సంవత్సరంతో పోలీస్తే నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నీటి నిల్వల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వ్యవ సాయ శాఖాధికారులను రైతు వేదికల్లో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాలు హాజరవుతున్న రైతులసంఖ్య వారికి అందిస్తున్న సలహాలపై ఆరాతీశారు. ఎల్‌నినో ప్రభావం వ్యవసాయ రంగంలో ఎదురయ్యే పరిస్థితులకు అనుగుణంగా రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. అటవీశాఖాధి కారులను ఫారెస్ట్- రెవెన్యూ సంయుక్త సర్వేలు, భూ రీసర్వే పురోగతిపైకలెక్టర్ ఆరా తీశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ సంయుక్త సర్వేలను నిర్దేశిత విధానాల ప్రకారం చేపట్టాలని, సర్వేలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల ప్రజావాణికి ప్రజలు తక్కువ సంఖ్యలో హాజరవుతున్న అంశంపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతివారం ఎంతమంది దరఖాస్తు దారులు వస్తున్నారు. మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యల కోసం ప్రజలు జిల్లా కేంద్రంలోని ప్రజావాణికి ఎందుకు వస్తున్నారు అనే వివరాలను ఎంపిడిఓను అడిగి తెలుసుకున్నారు. మండల ప్రజావాణి కార్యక్రమంపై గ్రామాల్లో టామ్ టామ్‌ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, యువత సహకారంతో సోషల్ మీడియా ద్వారాప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి, సత్వరపరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మురళి, ఎంపిడిఓ రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో యాదాద్రి గిరి ప్రదక్షిణ..

- భక్తి పారవశ్యంతో సాగిన భక్తుల ప్రదక్షిణ
- గోవింద, నారసింహ నామస్మరణలతో మారుమోగిన యాదగిరికొండ
- వైకుంఠ ద్వారం వద్ద స్వామివారి పాదాలకు ప్రత్యేక పూజలు
- పాల్గొన్న ఆలయ ఈవో భవాని శంకర్

**యాదగిరిగుట్ట, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం గిరి ప్రదక్షిణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు వేకువజామునే యాదాద్రికి చేరుకొని స్వామివారిని స్మరిస్తూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. రింగ్‌రోడ్డు సమీపంలోని వైకుంఠ ద్వారం వద్ద ఆలయ ఈఓ భవాని శంకర్ స్వామివారి పాదాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలాభిషేకం, కొబ్బరికాయ సమర్పణ,హారతి అనంతరం గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. అంతకుముందే గిరి ప్రదక్షిణకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వైకుంఠ ద్వారం, యాదాద్రి మెట్లదారి, రింగ్‌రోడ్డు పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పాటు వందలాది వాహనాలతో పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. 'నమో నారసింహ', 'జయ నారసింహ' నామస్మరణలతో యాదగిరికొండ మారుమోగింది.



భాజా భజంత్రీలు, భజనలు, గోవింద నామస్మరణ, అన్నమయ్య కీర్తనలు, కోలాట ప్రదర్శనల నడుమ భక్తులు కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేశారు. దీంతో యాదాద్రి క్షేత్రం ఆద్యంతం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండి పోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు సుమారు మూడు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ మార్గంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గిరి ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించు కున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధానార్చకులు మాధవా చార్యులు, అర్చకులు ప్రణీత్, ఎస్‌పీఎఫ్ సీఐ శేషగిరిరావు, ఎస్‌పీఎఫ్ ఏఎస్ఐ కనకయ్య, మోహన్ రెడ్డి, సిబ్బంది, పాండు, దేవస్థాన అధికారులు, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అసెంబ్లీ ప్రాంగణంలో అంబరాన్ని తాకిన బతుకమ్మ సంబరాలు

- బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడిన మహిళలు..
- పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి..



**హైదరాబాద్, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతికి ప్రతీక అని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం రోజు సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ సంబరాల్లో శాసనసభ సభాపతి, శాసన మండలి చైర్మన్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ పాల్గొని ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడారు. బంతి, చామంతి, గునుగు, తంగేడు పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, మహిళా ఉద్యోగులు, సిబ్బంది చుట్టూ చేరి "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అంటూ పాటలు పాడుతూ ఆడి పాడారు. మహిళలంతా బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య సాగిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణం సోమవారం సాయంత్రం రంగురంగుల పూలతో, ఆడపడుచుల ఆనంద కోలాహలంతో కళకళలాడింది. బతుకమ్మ వేడుకల్లో శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, శాసనసభ సెక్రెటరీ ఆర్. తిరుపతి, శాసనసభ, శాసన మండలి ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు..

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు..

**యాదగిరిగుట్ట, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరా త్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం పర్వత వర్ధిని అమ్మవారు శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రాతఃకాల పూజలు, అర్చనలు, పారాయణాలు, శ్రీదేవి మూలమంత్ర జపం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం శ్రీదేవి చతుష్షష్టి ఉపచార పూజ, నీరాజనం, మంత్రపుష్పం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేదమంత్రాల నడుమ జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తాయి. సాయంత్రం 7 గంటల నుంచి నవావరణ పూజలు, కుంకుమార్చనలు, నిర్వహిం పబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ భవాని శంకర్ శివాలయ ప్రధానార్చకులు నరసింహమూర్తి, అర్చకులు సాయి కృష్ణ, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



## కత్తితో తలపై దాడి ఆపై పరారు

- మహిళపై కత్తితో దాడి.. తలలో గాయం..
- మహిళ మతిస్థిమితం సరిగా లేదంటున్న తండ్రి..

**చేవెళ్ల, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళని కత్తితో తలపై పొడిచి తీవ్రంగా గాయపరిచి పారిపోయిన ఘటన చేవెళ్ల మండల పరిధిలోని మీర్జగూడ గేట్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జగూడా గేట్ సమీపంలో ఓ గుర్తు తెలియని మహిళ రక్తగాయాలతో పడి ఉండదని మీర్జగూడ గ్రామానికి చెందిన పర్వేద శంకరయ్య అనే వ్యక్తి సమాచారం ఇచ్చాడు. ఆమెను వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం పట్నం మహేందర్ రెడ్డి హాస్పిటల్ కు తరలించడం జరిగింది. బాధితురాలి వివరాలు తెలుసుకోగా తన పేరు కల్సాని వీణ (26) తండ్రి కల్సాని ఇంద్రా రెడ్డి, నివాసం ప్రేమ్ నగర్ కాలనీ, హఫీజ్ పేట్ శేరిలింగం పల్లి అని గుర్తించడం జరిగింది. బాధితురాలి తండ్రిని విచారించగా... తన కూతురు మానసిక స్థితి చిన్నప్పటినుండి బాలేదని, తనకు గతంలో పాలకుర్తికి చెందిన జగన్ అనే వ్యక్తితో 2024 పెళ్ళి ఒకనెలలోనే విడాకులు తీసుకున్నారు. ఏఐజి, కాంటినెంటల్, ఎర్రగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో మూడునెలపాటు చికిత్స కూడా తీసుకుంది. అప్పుడప్పుడు ఇంటినుండి వెళ్లి మూడు నాలుగు రోజుల తరువాత ఇంటికి వస్తుంది. ఈ నెల మూడవ తారీకు ఇంటినుండి వెళ్లి తిరిగి రాలేదు తీరా చూస్తే చేవెళ్ల పీఎస్ నుండి తన కూతురిని ఎవరో గాయపరచారని ఫోన్ వచ్చిందని బాధితురాలి తండ్రి తెలిపారు. తండ్రి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## భాగ్యలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ఏలేటి కవితా రెడ్డి..

- చార్మినార్ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు..
- బీజేపీ నాయకుడు ఉదయ్ కిరణ్ రెడ్డితో కలిసి పూజా కార్యక్రమం..

**హైదరాబాద్, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** చార్మినార్ వద్ద కొలువుదీరిన శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారిని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సతీమణి ఏలేటి కవితా రెడ్డి, బీజేపీ నాయకుడు ఉదయ్ కిరణ్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందారు. వారిని సాదరంగా ఆహ్వానించి వేదాశీర్వాదం, ప్రసాదాలు అందించారు ఆలయ సిబ్బంది, అర్చకులు..





నాగోల్, ఆర్బీఐ కాలనీలో బతుకమ్మ సంబరాలు చాలా అత్యద్భుతంగా జరిగాయి.. కాలనీవాసులందరూ ఎంతో ఆనందదాయకంగా వివిధ రకాల బతుకమ్మలు చేసుకొని అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించుకున్న దృశ్యాలు..

# ఖమ్మంలో తంజీమ్-ఎ-ఇన్సాఫ్ నగర మహాసభ విజయవంతం

- నూతన కమిటీ ఎన్నిక, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక




**ఖమ్మం , అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక బైపాస్ రోడ్డులో ఎస్.కె. సైదా అధ్యక్షతన తంజీమ్- ఎ - ఇన్సాఫ్ నగర నూతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులపై కూలంకషంగా చర్చించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మొహమ్మద్ సలాం మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటూ తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రభుత్వ తీరుకు ప్రజల ద్వారా తగిన బుద్ధి చెప్పాలని సమావేశంలో నిర్ణయించారు. మత సామరస్యాన్ని పరిరక్షించాలని, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించాలని ఈ సందర్భంగా ప్రత్యేక తీర్మానం చేశారు.--- నగర నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక సమావేశానంతరం ఏరియాల వారీగా నగర స్థాయి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులు గా మొహమ్మద్ మసీయుద్దీన్, అధ్యక్షులు గా నిజాంపేట్ యాకుబ్, ఉపాధ్యక్షులు గా ఎండీ. జాకిర్, సైదా బేగం ప్రధాన కార్యదర్శిగా ఎండీ. మజీద్, సహాయ కార్యదర్శులుగా మహబూబ్ పాషా, జకీయ, ఎస్.కె. చానా, బేగం, సుర్వీన్ ప్రచార కార్యదర్శిగా అక్రమ్ఏరియా వారీగా నూతన కమిటీలు, వన్ టౌన్ ఏరియా కమిటీ: అధ్యక్షుడు: సాంటరీ యాకుబ్, ఉపాధ్యక్షులు: వహబ్, ఎస్.కె. ఖాజా, కార్యదర్శి: ముజామ్మిల్, సహాయ కార్యదర్శులు: తుమ్మలగడ్డ యాకుబ్, సైదా బేగం, అస్లం, నాగుల్ మీరాటూ టౌన్ ఏరియా కమిటీ: అధ్యక్షుడు: ఎస్.కె. చానా, ఉపాధ్యక్షులు: అమీర్ హంజా, కరీం, కార్యదర్శి: ట్రాక్టర్ రెహమాన్, సహాయ కార్యదర్శులు: ఎస్.కె. మీరా, తోట మస్తాన్, డాక్టర్ ఖాసీం పాషా, త్రీ టౌన్ ఏరియా కమిటీ, అధ్యక్షుడు: టింకరింగ్ షరీఫ్, కార్యదర్శి: మహబూబ్ పాషా, సహాయ కార్యదర్శి: బాషా భాయ్, ఖానాపురం హవేలి కమిటీ, అధ్యక్షుడు: ఎస్.కె. అక్రమ్, కార్యదర్శి: ఎండీ. జాకిర్, వర్కింగ్ ప్రెసిడెంట్: యూసుఫ్, కోశాధికారి: యాకుబ్ పాషా, ఉపాధ్యక్షుడు: అజీమ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రఫీ, ప్రచార కార్యదర్శి: జమీరుద్దీన్, ఈసీ మెంబర్లు: ఫయిమ్, ఫతే మొహమ్మద్తదితరులు ఏకగ్రీవంగా అన్ని కమిటీలు ఎన్నుకున్నారు. మతసామరస్యాన్ని ప్రజాస్వామ్యాన్ని హిందూ ముస్లిం భాయి భాయి అని భారతీయ పౌరులుగా ఐక్యతను మరో మారు స్వతంత్ర ఉద్యమాన్ని గుర్తు చేసుకొని ఆనాడు చేసిన ఉద్యమాన్ని గుర్తు చేసుకొని ఇప్పుడు మరలబిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతి పౌరుడు కంకణబద్ధులై వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని వారు పిలుపునిచ్చారు.

# ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ : అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

- వైభవంగా కలెక్టరేట్ లో ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు
- కలెక్టరేట్ లో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలలో పాల్గొని, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన అదనపు కలెక్టర్




**ఖమ్మం , అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకొనే బతుకమ్మ ప్రకృతిని పూజించే గొప్ప పండుగ అని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. కలెక్టరేట్ లో మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖల మహిళా అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ బతుకమ్మ వేడుకలలో కలెక్టరేట్లోని వివిధ శాఖలలో ఉన్న మహిళలంతా కలిసికట్టుగా పాల్గొన్నారు. ముందుగా గౌరమ్మ తల్లికి పసుపు, కుంకుమ, పూలతో పూజించారు. కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ బతుకమ్మ ఆట పాటలతో సందడి చేసిన మహిళలు, ఉద్యోగులతో కలిసి అదనపు కలెక్టర్ కలిసి ఆడి వారిని ఉత్తేజపరిచారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించుకుంటున్న బతుకమ్మ పండుగలో తొమ్మిది రోజులు రకరకాలుగా గౌరమ్మను కొలుచుకొంటూ, కలిసి కట్టుగా అందరూ ఒకేచోట చేరి ఆడుతూ, పాడుతూ బతుకమ్మను పూజించుకొంటారని అన్నారు. ఉద్యోగులు, సిబ్బంది అందరూ బతుకమ్మ సంబరాలలో పాల్గొని గౌరమ్మను కొలిచి ఆట, పాటలతో సందడి చేసారు.

# వైరా రైతుల పంటల రక్షణకు అత్యవసర కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలి

- చివరి ఆయకట్టు వరకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీటి భరోసా కల్పించాలి
- వైరా నియోజకవర్గానికి ప్రత్యేక కరువు నివారణ, సాగునీటి ప్రణాళిక కోరుతూ జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం పంపిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బి. చంద్రావతి



**ఖమ్మం , అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే నీటి కొరత ముప్పును దృష్టిలో ఉంచుకుని, వైరా నియోజకవర్గంలోని రైతుల పంటలను, గ్రామీణ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు అత్యవసర కార్యాచరణ రూపొందించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి కోరారు.ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లకు లిఖితపూర్వక వినతి పత్రాన్ని ఈ-మెయిల్ ద్వారా పంపినట్లు తెలిపారు. వైరా, కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు, కారేపల్లి మండలాల్లో పంటల పరిస్థితి, సాగునీటి అవసరాలు, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భజలాల లభ్యత, తాగునీటి వనరులపై గ్రామస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని కోరారు.ముఖ్యంగా సీతారామ ప్రాజెక్టు, వైరా ప్రాజెక్టుల ద్వారా అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించి, చివరి ఆయకట్టు రైతుల వరకు సాగునీరు చేరేలా స్పష్టమైన నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణ, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా, గ్రామాలు, తండాల్లో తాగునీటి సమస్యల నివారణతో పాటు పశుగ్రాసం, పశువులకు తాగునీటి లభ్యతపై ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు."రైతుల పంటలు ఎండిపోయిన తర్వాత నష్టాన్ని లెక్కించడం కాదు. పంటలను కాపాడేందుకు ముందుగానే చర్యలు చేపట్టాలి. రైతు కష్టాన్ని గుర్తించి, సమస్య తీవ్రతరమయ్యేలోపే పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యత" అని డా. బి. చంద్రావతి స్పష్టం చేశారు. పత్రికా కథనాల ప్రకారం, అక్టోబర్ 12న జరగాల్సిన కరువు, ఎల్‌నినో మంత్రుల సమీక్ష వాయిదా పడినట్లు తెలిసిందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు, తదుపరి సమావేశ తేదీని అధికారికంగా వెంటనే ప్రకటించాలని కోరారు.అప్పటివరకు రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి నష్టపోకుండా నీటి లభ్యత, విద్యుత్ సరఫరా, సాగుకు అనుకూలమైన పంటలు, ప్రత్యామ్నాయ పంటలపై జిల్లాలు, మండలాలు, గ్రామాలవారీగా లిఖితపూర్వక మధ్యంతర యాసంగి మార్గదర్శకాలను తక్షణమే జారీ చేయాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ, నీటిపారుదల, విద్యుత్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖలు సమన్వయంతో పనిచేసి, స్థానిక సమస్యలను గుర్తించాలని సూచించారు. వాటి పరిష్కారానికి బాధ్యత గల అధికారులను నిర్ణయించి, నిర్దిష్ట కాలపరిమితిలో చర్యలు చేపట్టాలని కోరారు."సమీక్ష వాయిదా పడవచ్చు, రైతుల సమస్యలు, ప్రభుత్వ బాధ్యత వాయిదా పడకూడదు. ప్రతి గ్రామానికి కార్యాచరణ ఉండాలి. ప్రతి శాఖకు బాధ్యత ఉండాలి. ప్రతి రైతుకు భరోసా కలగాలి. సాగునీరు చివరి ఆయకట్టు రైతుకు చేరినప్పుడే ప్రభుత్వ సమీక్షలకు నిజమైన సార్థకత ఉంటుంది" అని డా. బి. చంద్రావతి పేర్కొన్నారు.వినతిపత్రంపై రెండు జిల్లాల యంత్రాంగం తక్షణమే స్పందించి, చేపట్టబోయే చర్యలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.

# ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్

- ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు




**ఖమ్మం , అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదు దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఏస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ముదిగొండ మండలం మల్లన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్.కే. జాన్ బీ తన సదరం సర్టిఫికెట్‌లో తప్పుడు వివరాల కారణంగా దివ్యాంగుల పింఛన్ నిలిచిపోయిందని, తిరిగి పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ విషయాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు.పీడీఎస్‌యూ అధ్యక్షుడు టి. లక్ష్మణ్ పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేరుతో ముందస్తు ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న వేదాంత లెర్నింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దీనిపై పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.ఏదులాపురం పట్టణానికి చెందిన ఎస్.కే. ఆఫ్సానా తాను ఎంబీఏ పూర్తి చేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, విద్యార్హతలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలపై పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధి అధికారికి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేకే ఫోటోగ్రఫీ స్టూడియో గ్రాండ్ ఓపెనింగ్ ఖమ్మంలో




**ఖమ్మం , అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :**

సోమవారం ముదిగొండ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సామల కోటేశ్వరరావు నూతన స్టూడియో ప్రారంభోత్సవానికి ఖమ్మం జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మారగాని వెంకట్ ముఖ్య అతిథిగా విచ్చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మారగాని వెంకట్ మాట్లాడుతూ"సామల కోటేశ్వరరావు ఫోటోగ్రఫీ రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, కే కే ఫోటోగ్రఫీ దినదినాభివృద్ధి చెందాలని, మరిన్ని విజయాలు సాధిస్తూ మంచి పేరు సంపాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. నూతనంగా ప్రారంభించిన ఈ స్టూడియో ఆయనకు మంచి భవిష్యత్తును అందించాలని ఆకాంక్షిస్తున్నాను" అని అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు పిన్నం కనకారావు, కోశాధికారి నిరుడు తిరుపతిరావు, ఖమ్మం టౌన్ అధ్యక్షులు కోవెల శ్రీనివాసరావు , ఖమ్మం టౌన్ మాజీ అధ్యక్షులు రఘు, సత్తుపల్లి అధ్యక్షులు భాషా పాల్గొని కోటేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన ప్రారంభోత్సవానికి విచ్చేసి ఆశీర్వదించిన సంఘ నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## వన్ డే–వన్ వార్డు కార్యక్రమంలో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ది సిటిజన్స్ కౌన్సిల్నెక్నాంపూర్.



**రాజేంద్రనగర్, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** నార్సింగి సర్కిల్–45,సీఎం సి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన "వన్ డే–వన్ వార్డ్" కార్యక్రమంలో ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి,స్థానిక కాలనీల ప్రతినిధులు పాల్గొని పలు కీలక పౌర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.రహదారుల అభివృద్ధి,పార్కుల పరిరక్షణ,వీధి దీపాలు,పారిశుద్ధ్యం,ప్రజా సౌకర్యాలు తదితర అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రధానంగా ప్రస్తావించిన సమస్యలు..వైఎస్ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి,స్థానిక ఓటర్ల సౌకర్యార్థం వైఎస్ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సుబ్బరాజు ప్రస్తావించారు.పయనీర్ కాలనీ,ఇవీవీ కాలనీ,శ్రీ వెంకటేశ్వర కాలనీ,వైఎస్ఆర్ కాలనీ,పాషా కాలనీ,కోహినూర్ ఎన్‌క్లేవ్,గోల్కొండ హిల్స్ ప్రాంతాల ఓటర్లకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.ఈ ప్రజాప్రయోజన అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సుబ్బరాజు గారిని ది సిటిజన్స్ కౌన్సిల్ అభినందించింది.సంబంధిత ఎన్నికల అధికారులు ఈ ప్రతిపాదనను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.60 అడుగుల రహదారి కనెక్టివిటీనెక్నాంపూర్ ప్రాంతంలో రాకపోకలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదిత 60 అడుగుల రహదారి అభివృద్ధిని వేగవంతం చేయాలని ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి కోరారు.పయనీర్ పార్కు అభివృద్ధికి రూ.20 లక్షలు–పనులు త్వరగా ప్రారంభించాలిపయనీర్ పార్కు సుందరీకరణ కోసం రూ.20 లక్షలు కేటాయించిన నేపథ్యంలో,పనుల ప్రారంభానికి అవసరమైన వర్క్ ఆర్డర్‌ను త్వరితగతిన జారీ చేసి అభివృద్ధి పనులను ఆలస్యం లేకుండా ప్రారంభించాలని కౌన్సిల్ కోరింది.పార్కులోని నర్సరీని మరో అనువైన ప్రదేశానికి తరలించి,పార్కును ప్రజల వినియోగానికి అభివృద్ధి చేయాలని సూచించింది.బటర్‌ఫ్లై సర్కిల్ నుంచి పాండెనవాగు నాలా వరకు 80 అడుగుల రహదారి మరమ్మతులుఆనంద లెగసీ ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాల కారణంగా దెబ్బతిన్నట్లు స్థానికులు పేర్కొన్న బటర్‌ఫ్లై సర్కిల్ నుంచి పాండెనవాగు నాలా వరకు ఉన్న 80 అడుగుల రహదారిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు.పార్కుల అభివృద్ధి–పచ్చదనం పెంపునెక్నాంపూర్ వార్డు 128 పరిధిలోని పయనీర్ కాలనీ,వైఎస్ఆర్ కాలనీ,కోహినూర్ కాలనీల్లో పార్కులను అభివృద్ధి చేయాలని ప్రతినిధులు కోరారు.శ్రీ వెంకటేశ్వర కాలనీ పార్కులో పెండింగ్‌లో ఉన్న మొక్కల నాటే పనులను పూర్తి చేసి, ప్రత్యేకంగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించాలని ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షులు సూచించారు.కోహినూర్ కాలనీలో మౌలిక సదుపాయాలుకోహినూర్ కాలనీ పార్కు అభివృద్ధి,వీధి దీపాల నిర్వహణ,చెట్ల కొమ్మల కత్తిరింపు,గుంతలతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులపై ఆ కాలనీ కోశాధికారి సమస్యలను ప్రస్తావించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.వైఎస్ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌కు అదనపు అంతస్తులుప్రస్తుతం ఉన్న వైఎస్ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌కు అదనపు అంతస్తులు నిర్మించి,స్థానిక ప్రజల సమావేశాలు,సామాజిక కార్యక్రమాలకు మరింత విస్తృతమైన సౌకర్యాలు కల్పించాలని దేవరాజ్ ,సుబ్బారావు కోరారు.వీధి దీపాల ఏర్పాటు నిర్వహణ పలు ప్రాంతాల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కొత్త వీధి దీపాల ఏర్పాటు,పనిచేయని దీపాల మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ప్రతినిధులు అధికారులను కోరారు.అక్రమ చెత్త పారవేతపై చర్యలుబహిరంగ ప్రదేశాల్లో చెత్తను అక్రమంగా పారవేసే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి,నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలని కోరారు.పరిసరాల పరిశుభ్రతను కాపాడేందుకు నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు.స్పీడ్ బ్రేకర్ల–రహదారి భద్రతఅవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రతినిధులు కోరారు.దీనిపై స్థానికుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని అధికారులు పేర్కొనగా,వాహనదారులు,పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తగిన పరిశీలన అనంతరం నిర్ణయం తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో అధికారులు ఏఎంసీ శ్రీధర్, డిఈ అన్వేష్ రెడ్డి,ఏ ఈ సంతోష్,వార్డు అధికారులు,ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు,శానిటేషన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.ది సిటిజన్స్ కౌన్సిల్ విజ్ఞప్తిప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి,ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ది సిటిజన్స్ కౌన్సిల్ కోరింది.ముఖ్యంగా రహదారుల అభివృద్ధి,పార్కుల సుందరీకరణ,పోలింగ్ కేంద్రం ఏర్పాటు,వీధి దీపాలు,పారిశుద్ధ్యం వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించి,పనులను కాలపరిమితిలో పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసింది.ది సిటిజన్స్ కౌన్సిల్ –మెరుగైన సమాజం కోసం ఎడుకేట్,అగోటటే,ఆర్గనైజ్ ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం అన్నారు.

## ఎల్‌నినో నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

### - మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**శామీర్‌పేట , అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సోమవారం అలియాబాద్ రైతు వేదికలో నిర్వహించిన వీడియో సమావేశం ద్వారా రాష్ట్రంలోని రైతులకు పలు సూచనలు చేశారు. ఎనిమిది నెలలపాటు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని, నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, జిల్లా ఉద్యాన అధికారి శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి రమేష్, ఉద్యాన అధికారి వెంకటరమణ, పశువైద్యాధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు

## దుర్గామాత నిమజ్జనం, బతుకమ్మ సంబరాలకు ఉత్పత్తి కుంట పౌండ్ లో వీటిని నింపాలని జోనల్ కమిషనర్ కు వినతి : ఈ వేణుగోపాల్.




**రాజేంద్రనగర్, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేయడానికి పత్తికొండలో అన్ని ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డిని కలవడం జరిగిందని బిజెపి నాయకులు ఈ వేణుగోపాల్ తెలిపారు.సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ నెల 18వ తేదీన ఆదివారం దుర్గాష్టమి,బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రాజేంద్రనగర్ లోని పత్తి కుంట వద్ద పౌండ్ లో మంచినీల్లు నింపి,విధి దీపాలు వెలిగించి బతుకమ్మ ఆడటానికి,నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేయవలసిందిగా కోరడం జరిగిందన్నారు.అలాగే దేవీ నవరాత్రి సందర్భంగా బస్తీ లలో వివిధ మండపాలలో ఏర్పాటు చేసిన అమ్మ వారి విగ్రహాలను నిమజ్జనం చేయడానికి క్రేన్ ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో గోల్కొండ గోషామహల్ జిల్లా ఇన్చార్జ్ వై శ్రీధర్,జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు కొమురయ్య,జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు జయనంద్ రెడ్డి,అత్తాపూర్ బిజెపి అధ్యక్షుడు సులిగే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దుఅదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**మల్కాజిగిరి, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజావాణికి వచ్చిన అర్జీలను నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో మాలతితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 88 అర్జీలు అందినట్లు తెలిపారు. అర్జీదారుల సమస్యలకు ప్రాధాన్యమిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని, తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు

## బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ఈ నెల 15న కలెక్టరేట్‌లో టీజీఓ ఆధ్వర్యంలో వేడుకలు



**మల్కాజిగిరి, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి మందిరంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓ) జిల్లా శాఖ రూపొందించిన బతుకమ్మ పోస్టర్‌ను డీఆర్వో మాలతి, డిప్యూటీ కలెక్టర్ మోక్షితతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీఓ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 14న హైదరాబాద్‌లోని టీజీఓ భవన్‌లో, 15న మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కురుమూర్తి, డీఆర్డీఓ సాంబశివరావు, మహిళా గెజిటెడ్ అధికారులు, ఉద్యోగినులు పాల్గొన్నారు.

## భార్గవి కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వర్క్ షాప్ గొప్ప ప్రారంభోత్సవం

- ఆరుట్ల గ్రామ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్
- ఆరుట్ల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కావలి శ్రీనివాస్ ముదిరాజ్
- వెలుతురు తెలుగు దినపత్రిక రిపోర్టర్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ కు శాలువాతో సన్మానం






**ఇబ్రహీంపట్నం, అక్టోబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో స్వయం ఉపాధి వ్యాపారంలో భాగంగా చెన ్నమోనిశ ంక ర్ ముదిరాజ్ దంపతులు ఏర్పాటు చేసుకున్న భార్గవి కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వర్క్ షాప్ ప్రారం భోత్సవం చేసిన ఆరుట్ల ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ ముదిరాజ్. సంఘం పెద్దలు ఈ సందర్భంగా ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ మాట్లాడుతూ,ఎంబ్రాయిడరీ వర్క్ లాంటి కుటీర పరిశ్రమలు గ్రామాల్లో పెట్టడం చాలా అభినందనీయం అని అన్నారు.ఇలాంటి ఎంబ్రాయిడరీ వర్కు చేయించుకోవాలి అంటే హైదరాబాద్ నగరానికి వెళ్ళవలసి వస్తుండే కానీ ఇప్పుడు ప్రజలకు అందుబాటులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మన ఆరుట్ల గ్రామంలోనే అన్ని రకాల కుటీర పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ప్రజలు హైదరాబాద్ నగరానికి వెళ్లకుండా ఇబ్బందులు తప్పుతున్నాయి అన్నారు.చెన్నమోని శంకర్ ముదిరాజ్ దంపతులు వ్యాపార పరంగా బాగా ఎదగాలని కోరుకుంటూ అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నూకం సత్తయ్యముదిరాజ్,గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్.మానిపాటి కుమార్ ,వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్,ఆరుట్ల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కావలి శ్రీనివాస్ ముదిరాజ్ ,నూకం బాలయ్య ,శేఖర్ ముదిరాజ్ ,దాసరమోని రమేష్ ముదిరాజ్ ,బుట్టి జంగయ్య ముదిరాజ్ ,తలారి కృష్ణ ముదిరాజ్ ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ ముదిరాజ్ ,గుడ్డిమల్ల రాజు ముదిరాజ్ ,శంకర్ ముదిరాజ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కువైట్‌లో చిక్కుకున్న నిడదవోలు మహిళకు మంత్రి కందుల దుర్గేష్ భరోసా



**నిడదవోలు, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్) :** భర్త ఆకస్మిక మరణవార్త విని కువైట్‌లో చిక్కుకుపోయిన నిడదవోలు నియోజకవర్గం మునిపల్లెకు చెందిన చింతల నాగలక్ష్మిని మంత్రి కందుల దుర్గేష్ చొరవతో స్వగ్రామానికి రప్పించారు. ప్రయాణ ఖర్చులకు కూడా డబ్బులు లేని పరిస్థితిలో, యాజమాన్యం స్వదేశానికి వెళ్లేందుకు అడ్డంకులు సృష్టించడంతో ఆమె వీడియో ద్వారా మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.
విషయం తెలుసుకున్న మంత్రి దుర్గేష్ వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, క్యాంపు కార్యాలయ అడిషనల్ పీఎస్ కేఎస్‌వీ రమణ రావు, స్థానిక జనసేన నాయకులు, ఏపీఎన్ఆర్టీ ప్రతినిధులతో సమన్వయం చేశారు. కువైట్ అధికార యంత్రాంగంతో మాట్లాడి నాగలక్ష్మిని ఎలాంటి ఖర్చు లేకుండా అత్యవసరంగా స్వదేశానికి పంపే ఏర్పాట్లు చేశారు. దీంతో ఆమె నిడదవోలు చేరుకుని భర్త చింతల వెంకటేష్‌కు తుది వీడ్కోలు పలికారు.
తన కష్టకాలంలో అండగా నిలిచి, భర్తను చివరిసారిగా చూసుకునే అవకాశం కల్పించిన మంత్రి దుర్గేష్‌కు నాగలక్ష్మి, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బాధితురాలిని సురక్షితంగా స్వగ్రామానికి రప్పించడంలో ప్రత్యేక చొరవ చూపిన అడిషనల్ పీఎస్ రమణ రావును మంత్రి అభినందించారు.

## ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్ట్



- రూ.20 లక్షల విలువైన 21 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**గుంటూరు, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంతో పాటు పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను లాలాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ. 20 లక్షల విలువైన 21 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 20 సుజుకి యాక్సెస్ స్కూటీలు, ఒక సీడీ డీలక్స్ బైక్ ఉన్నాయి.
మార్కెట్ సెంటర్ సమీపంలోని పల్నాడు బస్‌స్టాప్ వద్ద వాహన తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంతో దొంగతనాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కాలనీలు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో పార్క్ చేసిన వాహనాలను హ్యాండిల్ లాక్ ధ్వంసం చేసి, వైర్లకు డైరెక్ట్ కనెక్షన్ ఇచ్చి చోరీ చేసేవారని పోలీసులు తెలిపారు.
నిందితులు లాలాపేట, పాత గుంటూరు, నల్లపాడు, పట్టాభిపురం, సత్తెనపల్లి ప్రాంతాల్లో వాహనాలు చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. నలుగురు నిందితులను కోర్టుకు, మైనర్ బాలుడిని జువైనల్ జస్టిస్ బోర్డుకు హాజరుపరిచేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## ఏపీలో జిల్లా పరిషత్ చైర్మన్ల రిజర్వేషన్లు ఇవే!

- రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ చైర్మన్లకు రిజర్వేషన్లు ఖరారు
- పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ ఉత్తర్వులు జారీ
- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు మహిళలకు గణనీయమైన ప్రాధాన్యత
- త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు మార్గం సుగమం
- రాజకీయ పార్టీలలో మొదలైన జడ్పీ పీఠాల సమీకరణాలు

**అమరావతి, అక్టోబర్ 13(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల రాజకీయాలు కీలక దశకు చేరుకున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 28 జిల్లా పరిషత్ (జడ్పీ) ఛైర్మన్ పదవులకు ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ మంగళవారం అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమమైంది.
గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల్లో జిల్లా పరిషత్‌లది అత్యంత కీలకమైన పాత్ర. ఈ నేపథ్యంలో జడ్పీ ఛైర్మన్ పదవుల రిజర్వేషన్ల ఖరారుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. జనాభా ప్రాతిపదికన, రొటేషన్ పద్ధతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు మహిళలకు రిజర్వేషన్లు కేటాయించడం ద్వారా సామాజిక న్యాయం పాటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మొత్తం 28 స్థానాల్లో సామాజిక వర్గాల వారీగా చూస్తే, షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) 5 స్థానాలు, షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) 3, వెనుకబడిన తరగతులకు (బీసీ) 6 స్థానాలు దక్కాయి. మిగిలిన 14 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉంచారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, అన్ని కేటగిరీలలో కలిపి మొత్తం 14 స్థానాలను మహిళలకే కేటాయించడం విశేషం. ఈ రిజర్వేషన్ల ప్రకటనతో రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలలో సందడి మొదలైంది. ఆయా జిల్లాల్లో రిజర్వేషన్లకు అనుగుణంగా ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేయనున్నారు.

**జిల్లాల వారీగా రిజర్వేషన్ల పూర్తి వివరాలు:**

**ఎస్సీ, ఎస్టీ కేటగిరీలు:**
తిరుపతి – ఎస్సీ మహిళ
గుంటూరు – ఎస్సీ మహిళ
కోనసీమ – ఎస్సీ మహిళ
ఎన్టీఆర్ – ఎస్సీ
ప్రకాశం – ఎస్సీ
పోలవరం – ఎస్టీ మహిళ
అల్లూరి సీతారామరాజు – ఎస్టీ
పార్వతీపురం మన్యం – ఎస్టీ

**బీసీ కేటగిరీలు:**
అనకాపల్లి – బీసీ మహిళ
శ్రీకాకుళం – బీసీ మహిళ
విజయనగరం – బీసీ మహిళ
విశాఖపట్నం – బీసీ
అనంతపురం – బీసీ
కర్నూలు – బీసీ

**అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలు:**
**మహిళలు:** కృష్ణా, పల్నాడు, తూర్పుగోదావరి, బాపట్ల, కాకినాడ, చిత్తూరు, ఏలూరు.
**జనరల్:** నెల్లూరు, అన్నమయ్య, మార్కాపురం, నంద్యాల, శ్రీసత్యసాయి, పశ్చిమగోదావరి, వైఎస్ఆర్ కడప.

# బీసీల రక్షణకు త్వరలో ప్రత్యేక చట్టం

- రాజకీయ, ఆర్థిక, విద్యా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి, అక్టోబర్ 13: బీసీల హక్కులు, రక్షణకు ప్రత్యేకంగా బీసీ రక్షణ చట్టాన్ని త్వరలో తీసుకురానున్నట్లు భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బీసీల రాజకీయ, ఆర్థిక, విద్యా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని చెప్పారు. మంగళవారం అమరావతిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచడంలో టీడీపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని మంత్రి తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, ప్రస్తుత ప్రభుత్వం వాటిని 34 శాతానికి పెంచిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 40 శాతానికిపైగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించారని కొల్లు రవీంద్ర విమర్శించారు. ఈ కారణంగా సుమారు 16,800 మంది బీసీలు రాజ్యాంగబద్ధమైన పదవులకు దూరమయ్యారని పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి సమగ్ర సర్వే నిర్వహించిందని తెలిపారు.
స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే రాష్ట్రానికి రూ. 12,500 కోట్ల ఆర్థిక సంఘం నిధులు కోల్పోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. బీసీ వర్గాల్లోని వివిధ వృత్తుల వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కల్లు గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం కేటాయింపులు కల్పించినట్లు చెప్పారు.
చేనేత కార్మికులకు 'నేతన్నల సేవలో' పథకం ద్వారా ఏటా రూ. 25 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు మగ్గాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మత్స్యకారుల హక్కుల పరిరక్షణలో భాగంగా జీవో నంబర్ 217ను రద్దు చేశామని, వారి సంక్షేమం కోసం 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని అమలు చేస్తున్నామని వివరించారు.
గత వైసీపీ పాలనలో బీసీ నాయకత్వాన్ని అణచివేసే ప్రయత్నాలు జరిగాయని కొల్లు రవీంద్ర ఆరోపించారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా మరింత అవకాశాలు కల్పించడంతో పాటు వారి హక్కులకు చట్టపరమైన రక్షణ కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## వేమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెగా వైద్య శిబిరం

- వైద్య సేవలను పరిశీలించిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**వేమూరు, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్):** సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా వేమూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.
మెగా వైద్య శిబిరంలో రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, ఎక్స్‌రే, హెచ్ఐవీ కౌన్సెలింగ్, ఫిజియోథెరపీ, ప్రసూతి, శిశు వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. అదేవిధంగా ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల వివరాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించి, అవసరమైన వైద్య సహాయాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు.
వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందేందుకు ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నక్కా ఆనందబాబు సూచించారు.
ప్రజల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల ముందస్తు గుర్తింపు, వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే శిబిరం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## కొర్నెపాడులో పర్యటించిన కలెక్టర్ సాయికాంత్ వర్మ

- బయోచార్ తయారు చేసే వివిధ రకాల పద్ధతుల పరిశీలన



**గుంటూరు, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ మంగళవారం వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఉన్న రైతు నేస్తం ఫౌండేషన్ ని సందర్శించి అక్కడ జరుగుతున్న ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా తరగతులు, ప్రకృతి వ్యవసాయంలో ఫైవ్ లేయర్ మోడల్ విధానాలు, అచ్చట ఉన్న దేశీయ గోజాతులు – ఒంగోలు, కాంక్రీజ్ , పుంగనూరు, సాహివాల్ , గిర్ ఆవుల గురించి అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ ఎరువులు, ఘన జీవామృతం తయారీ విధానం, కాషాయాలు, జీవామృతం తయారీ విధానం, సమగ్ర వ్యవసాయ విధానంలో భాగంగా గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ల పెంపకం గురించి అవగాహన చేసుకోవడం, ఆవుల గో మూత్రం, పేడతో వివిధ రకాలైన బై ప్రోడక్ట్స్ – ప్రమిదలు, ధూప్ స్టిక్స్, పిడకలు, వినాయక ప్రతిమల తయారీ పై ఆరా తీశారు. మహిళలు తమ ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమలను స్థాపించుటకు తద్వారా ఆర్థికంగా అభివృద్ధి కావడానికి అవకాశాలపై రెండు రోజుల నుండి రైతు నేస్తం ఫౌండేషన్ లో శిక్షణ పొందుతున్న స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో వచ్చిన మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. రైతు నేస్తంలో జరుగుతున్న ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాలను పరిశీలించారు. టమాటా సాస్ తయారీ విధానం, అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ విధానం, వేరుశెనగ విత్తనాలు వేరు చేసే యంత్రం, వెన్న తీసే యంత్రం, బూందిలో నుండి ఆయిల్ వేరు చేసే యంత్రం, ఎద్దుల గానుగ నూనె తయారీ, పిండి వంటల తయారీ మెషిన్, మిల్లెట్స్ బిస్కట్స్ తయారీ మెషిన్, గరం మసాలా తయారీ మెషిన్, వెజిటబుల్ కట్టర్ మెషిన్, పాకింగ్ మెషిన్, వాక్యూమ్ పాకింగ్ మెషిన్, మోడల్ ఆర్గానిక్ స్టోర్, బయో రీసెర్చ్ సెంటర్ ని పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు స్థాయిలో బయోచార్ తయారు చేసే వివిధ రకాల పద్ధతులను తెలుసుకొని, వాటిని రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేసి రైతుల భూముల ఆరోగ్యాన్ని మెరుగు పరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన పెంచాలని, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వర రావుని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎం.పద్మావతి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, ప్రకృతి వ్యవసాయం డి.పి.ఎం రాజకుమారి, నాబార్డ్ డి.డి.ఎం శరత్, ఎల్.డి.ఎం మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భవాని దేవి అలంకారంలో వాసవి అమ్మవారు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) :** కడప జిల్లా బ్రహ్మంగారిమఠం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు మంగళవారం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు భవానీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దాతలు ఉదయం హోమంలో పాల్గొని అమ్మవారికి పంచామృతాభిషేకం సాయంత్రం కుంకుమార్చన అర్చకులు జూటూరు నరసింహ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు అధ్యక్షులు అయ్యప్ప సురేష్ బాబు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కుటుంబాలకు సభ్యులు భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎరువుల సరఫరాలో సమస్యలు ఉండరాదు




**గుంటూరు, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎరువుల సరఫరాలో సమస్యలు ఉండరాదని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాథమిక రంగాలపై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. యూరియా, ఎరువుల సరఫరా, డిమాండ్ అంచనాలు వేసి అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా లోపం ఉండరాదన్నారు. ఎయిమ్స్ యాప్ ద్వారా పంపిణీ జరగాలన్నారు. రైతుల ఇ – కేవైసి త్వరగా చేయించాలన్నారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగు పరచుకోవాల్సి ఉందని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రాథమిక రంగాల శాఖలు పనిచేయాలని స్పష్టం చేశారు. రైతులకు సకాలంలో సూచనలు, సలహాలు అందించాలని తద్వారా పంటలు, పశువుల పోషణ సక్రమంగా జరిగి ఆర్థికంగా బలోపేతం కావడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆవులు, గేదెల పెంపకం వలన పాల ఉత్పత్తికి దోహదం చేయవచ్చని, కోళ్ళు, మేకల పెంపకం కూడా ఆర్థిక అభ్యున్నతికి అవకాశం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న లక్ష్యాలను చేయడంలో అశ్రద్ధ చేయరాదని అన్నారు. ప్రకృతి వ్యవసాయం దిశగా ఎక్కువ మంది రైతులు మార్పు చెందుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.
జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి మాట్లాడుతూ ఇ – పంట 97 శాతం పూర్తి అయిందన్నారు. లక్ష్యం మేరకు పూర్తి చేస్తామని చెప్పారు. సిబ్బంది కరువు లెక్కల సేకరణలో కొంత మేర నిమగ్నం కావడం వలన కొంత జాప్యం జరిగిందన్నారు. సి.సి.ఆర్సి బీమా శత శాతం చేశామన్నారు. మూడు డ్రోన్ లు ఎస్.సి లబ్ధిదారులకు రావలసి ఉందన్నారు. మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ టి. నరసింహా రెడ్డి మాట్లాడుతూ యూరియా, ఎరువుల కొరత లేదన్నారు.
ప్రకృతి వ్యవసాయం డి.పి.ఎం రాజ కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం క్రింద 49,620 ఎకరాలలో 44,029 మంది రైతులు చేయుటకు లక్ష్యంగా ఇవ్వడం జరిగిందని వివరించారు.
ఈ సమావేశంలో ఉద్యాన శాఖ ఉప సంచాలకులు మరియు ఎ.పిఎం.ఐ.పి పి.డి ఎల్. వజ్రశ్రీ, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి.సత్యనారాయణ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌ఫోర్స్ జవాన్ మృతికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సంతాపం



**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు మండలం వనిపెంట గ్రామానికి చెందిన ఎయిర్‌ఫోర్స్ జవాన్ మల్లెబోయిన కిరణ్ అనారోగ్య కారణాలతో నిన్న మృతి చెందడంతో, మంగళవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వనిపెంట గ్రామానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా కిరణ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.
అనంతరం మిట్టమానుపల్లె గ్రామానికి చెందిన అరికోటం నారాయణ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.
మృతుల కుటుంబాలకు ఈ విషాద సమయంలో మనోధైర్యం కలగాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మండల నాయకులు భీమయ్య, పెరుగు వీరయ్య బ్రహ్మంగారిమఠం మాజీ ఎంపీపీ వీరనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్చి నాటికి 15 వేల మందికి రుణాలు ఇవ్వాలి: చీఫ్ విప్ జీవీ



- పేదలకు సబ్సిడీ, ముద్ర రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు ఆదేశం

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** వినుకొండ పట్టణం మున్సిపల్ కార్యాలయంలో PMEGP, PMFME, ఇతర సబ్సిడీ రుణాలు మరియు ముద్ర రుణాలపై ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జీవీ గారు మాట్లాడుతూ.. పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి అవసరమైన సబ్సిడీ, ముద్ర రుణాలను బ్యాంకర్లు త్వరితగతిన అందజేయాలని సూచించారు. మార్చి నెల ముగిసేలోపు నియోజకవర్గంలో 15,000 మందికి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు మేనేజర్లను ఆదేశించారు. అలాగే వ్యవసాయంతో పాటు అధిక లాభాలనిచ్చే పశుపోషణ పై ప్రజలు దృష్టి సారించేలా ప్రోత్సహించాలని కోరారు. అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు వైఎస్ఆర్సిపి పార్టీ మండల కార్యాలయం ప్రారంభం



- విజయవంతం చేయాలని వైసీపీ శ్రేణులకి పిలుపు
- వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు రత్నకుమార్ యాదవ్

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల స్థాయిలో నూతన పార్టీ కార్యాలయాన్ని గురువారం ఉదయం 10 గంటలకు బ్రహ్మంగారిమఠంలో ప్రారంభిస్తున్నట్లు వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్ యాదవ్ తెలిపారు.
వైసీపీ మండల అధ్యక్షుడు రత్నకుమార్ యాదవ్ మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లగా మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కృషి చేయడం జరిగిందన్నారు. అది నేటితో అందరి సహకారంతో ఇప్పుడు ఆ పని నెరవేరింది పేర్కొన్నారు కావున ఈ ప్రారంభోత్సవానికి జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథ్ రెడ్డి.
మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురాంరెడ్డిలతోపాటు మాజీ శాసనసభ్యులు ఎమ్మెల్సీలు హాజరవుతున్నారన్నారు. బ్రహ్మంగారిమఠం మండలంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు ఇచ్చారు .
ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విశ్వబ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు గొడ్ల వీడు సుబ్రహ్మణ్యం. వైఎస్ఆర్సిపి జిల్లా ఆర్టిఐ వింగ్ జనరల్ సెక్రెటరీ బి. ఎస్ నారాయణరెడ్డి. భోగి రెడ్డి వెంకటసుబ్బారెడ్డి. చంద్ర ఓబుల్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మనోహరా చారి తదితర నాయకులు పాల్గొన్నారు.

**వైఎస్ఆర్సిపి గుర్తింపు కార్డుల పంపిణీ**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తింపు కార్డులను కార్యకర్తలకు మైదుకూరు మాజీ శాసనసభ్యులు ఎస్ రఘురాం రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్ యాదవ్ తెలిపారు. కావున ప్రతి గ్రామపంచాయతీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తప్పక హాజరు కావాలని తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## 25న విజయవాడలో ఏపీ జేఏసీ అమరావతి మహిళా సదస్సు

**విజయవాడ, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ మహిళా ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి కృషి చేస్తోందని రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. అక్టోబర్ 25న విజయవాడలో రాష్ట్ర స్థాయి మహిళా సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మహిళా ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించేందుకు రాష్ట్రంలో తొలిసారిగా ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. గత మూడేళ్లుగా డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కమిటీలను బలోపేతం చేస్తూ మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రస్తుత మహిళా విభాగం కమిటీ మూడేళ్ల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో అక్టోబర్ 25న 2026-2029 కాలానికి నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించనున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్, ఐదు రోజుల ప్రత్యేక సెలవులు, మహిళా దినోత్సవ నిర్వహణ వంటి అంశాల్లో మహిళా విభాగం కీలకంగా పనిచేసిందన్నారు.

ఉద్యోగుల ఉద్యమాల్లో మహిళా ఉద్యోగుల భాగస్వామ్యం కీలకమని, రెండు డీఏల విడుదల, 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ అమలులో పురోగతి సాధించామని తెలిపారు. సదస్సుకు 28 జిల్లాల ప్రతినిధులు హాజరు కావాలని మహిళా విభాగం నాయకులు పిలుపునిచ్చారు.

## తిరుపతిలో 1,000 మంది డప్పు కళాకారులతో ప్రపంచ రికార్డు లక్ష్యం




- **75 గంటల పాటు నిర్విరామంగా డప్పు వాయిద్యాలు**

**తిరుపతి అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుపతిలో 1,000 మంది డప్పు కళాకారులు 75 గంటల పాటు నిర్విరామంగా డప్పు వాయిద్యాలు మ్రోగిస్తూ ప్రపంచ రికార్డు సాధించే లక్ష్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వరల్డ్ రికార్డ్స్ ఇండియా సీఈఓ పవన్ సోలంకి తిరుపతికి చేరుకున్నారు.

ఈ సందర్భంగా ఆయనకు ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమం జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్న పవన్ సోలంకి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణ, కళాకారుల పాల్గొనడం, ప్రదర్శన కొనసాగింపు తదితర అంశాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

భారీ సంఖ్యలో డప్పు కళాకారులు ఒకేసారి పాల్గొంటూ 75 గంటల పాటు నిరంతరంగా ప్రదర్శన ఇవ్వడం ఈ కార్యక్రమంలోని ప్రత్యేకత. నిర్ణీత వ్యవధిలో కళాకారులు డప్పు వాయిద్యాలు మ్రోగిస్తూ ప్రదర్శన కొనసాగించనున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో కళాకారులు ఒకే వేదికపై నిరంతరంగా ప్రదర్శన ఇవ్వడం ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

కార్యక్రమంలో కళాకారుల ప్రదర్శనను పవన్ సోలంకి పరిశీలించనున్నారు. ప్రపంచ రికార్డు నమోదుకు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం కళాకారుల సంఖ్య, ప్రదర్శన వ్యవధి, నిరంతర ప్రదర్శన కొనసాగింపు తదితర అంశాలను లెక్కించనున్నారు. రికార్డు నమోదుకు అవసరమైన ప్రమాణాలను కార్యక్రమ నిర్వాహకులు పాటించేలా చర్యలు చేపట్టారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలను ప్రోత్సహించడంతో పాటు డప్పు కళాకారుల ప్రతిభను ప్రపంచస్థాయిలో చాటిచెప్పే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సంప్రదాయ డప్పు కళకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీశైలం డ్యాం



- **దేశంలో ఈ ఘనత సాధించిన తొలి నీటిపారుదల ప్రాజెక్టుగా గుర్తింపు**
- **భారీ క్రస్ట్ గేట్లు, 2009 వరదను తట్టుకున్న నిర్మాణ పటిష్టతకు గుర్తింపు**

**శ్రీశైలం, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగు రాష్ట్రాలకు జలవనరుల పరంగా కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీశైలం డ్యాం స్థానం సంపాదించింది. దేశంలో ఈ గుర్తింపు పొందిన తొలి నీటిపారుదల ప్రాజెక్టుగా శ్రీశైలం రికార్డు సృష్టించినట్లు నిర్వాహకులు తెలిపారు.

శ్రీశైలంలోని ఏపీ జెన్కో అతిథి గృహంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ జోన్ జాయింట్ సెక్రటరీ ఇలియాజర్ అవార్డు ధ్రువీకరణ పత్రాన్ని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో పాటు ఇరిగేషన్ ప్రాజెక్టుల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం ఆనకట్ట నిర్మాణ ప్రత్యేకతలు, దాని సామర్థ్యం, వరదలను తట్టుకున్న చరిత్రను వివరించారు.

శ్రీశైలం డ్యాంలో ఏర్పాటు చేసిన భారీ క్రస్ట్ గేట్లు ఈ గుర్తింపులో ప్రధాన అంశంగా నిలిచాయి. 60 అడుగుల వెడల్పు, 55 అడుగుల ఎత్తుతో ఉన్న గేట్లు ప్రాజెక్టు నిర్మాణ ప్రత్యేకతను చాటుతున్నాయి. ఎత్తైన ప్రాంతంలో నిర్మించినప్పటికీ బలమైన నిర్మాణంతో దశాబ్దాలుగా సేవలందిస్తున్న శ్రీశైలం డ్యాం ఇంజనీరింగ్ ప్రతిభకు నిదర్శనంగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు. 2009 అక్టోబర్‌లో శ్రీశైలం ప్రాంతాన్ని భారీ వరద ముంచెత్తింది. సుమారు 25.4 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చినప్పటికీ ఆనకట్ట నిర్మాణానికి ఎలాంటి భారీ నష్టం జరగకుండా నిలిచింది. ఆ స్థాయి వరదను తట్టుకుని ప్రాజెక్టు సురక్షితంగా నిలవడం దాని నిర్మాణ నాణ్యత, ఇంజనీరింగ్ సామర్థ్యానికి నిదర్శనంగా అధికారులు వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో లభించిన ఈ గుర్తింపుపై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. శ్రీశైలం ఆనకట్టకు లభించిన అవార్డు రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ గుర్తింపు జలవనరుల శాఖ అధికారులు, ఇంజనీర్లు, సిబ్బందిపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు ఖ్యాతి ఇకపై మరింత విస్తృతంగా ప్రపంచానికి పరిచయం కానుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ వేణుగోపాల్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఏపీ జెన్కో, ఏపీ ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆయుష్ వైద్య సేవల్లో ఆరు నెలల్లోనే గణనీయమైన పురోగతి

- **గతేడాది మొత్తం ఓపీ సేవల్లో 65 శాతం, ఐపీ అడ్మిషన్లలో 71 శాతం నమోదు**
- **సిబ్బంది హాజరు 81.89 శాతానికి పెరుగుదల**
- **జాతీయ ఆయుష్ మిషన్ కింద రూ.185.75 కోట్ల నిధులు.. ఈ ఏడాది అదనంగా రూ.22 కోట్లు**



**అమరావతి, అక్టోబర్ 13(జర్నలిస్ట్ ఫైల్):** వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలు మెరుగుపడుతున్నాయి. ఆసుపత్రుల్లో మందులను అందుబాటులో ఉంచడం, వైద్యుల సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి చర్యలతో రోగులకు మెరుగైన వైద్యం అందుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన మొత్తం ఓపీ సేవల్లో 65 శాతం, ఐపీ అడ్మిషన్లలో 71 శాతం నమోదయ్యాయి. సిబ్బంది హాజరు శాతం కూడా 79.32నుంచి 81.89కు పెరిగింది.

ఆయుష్ శాఖ పరిధిలోని ఆసుపత్రుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 16,22,656 ఓపీ సేవలు నమోదయ్యాయి. ఈ సంఖ్య గత ఆర్థిక సంవత్సరంలో అందించిన మొత్తం ఓపీ సేవల్లో 65 శాతానికి సమానం. ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందే ఇన్‌పేషెంట్ (ఐపీ) సేవల్లోనూ పురోగతి నమోదైంది. తొలి ఆరు నెలల్లో 9,230 ఐపీ అడ్మిషన్లు నమోదయ్యాయి. ఇది గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన మొత్తం ఐపీ అడ్మిషన్లలో 71 శాతానికి సమానం.

గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వారానికి రెండుసార్లు తప్పనిసరిగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వైద్యులు అందుబాటులో లేని లేదా మూసివేసిన ఔషధాలయాలను గుర్తించి, అక్కడ ఇన్‌ఛార్జిలను నియమించడం ద్వారా సేవలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. రోగులకు అవసరమైన నాణ్యమైన ఆయుష్ మందులను అందుబాటులో ఉంచుతున్నారు. జాతీయ ఆయుష్ మిషన్ నిధులతో కొత్త వైద్యులను నియమిస్తున్నారు. ఇందులో భాగంగా 12 మంది హోమియోపతి వైద్యులు, ముగ్గురు యునాని వైద్యుల నియామకాలు చేపట్టారు. ఓపీ సేవల పురోగతిని సమీక్షించేందుకు ప్రతి మంగళవారం ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ, నిర్దేశించిన లక్ష్యాల సాధనను పర్యవేక్షిస్తున్నారు.

ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు నిపుణులైన వైద్యులను అందుబాటులోకి తెస్తున్నారు. రోగులు త్వరగా కోలుకునేలా నాణ్యమైన మందులను సరఫరా చేస్తున్నారు. ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతను పెంచడంతో పాటు, రోగులకు అవసరమైన చికిత్స నిరంతరాయంగా అందేలా చర్యలు చేపడుతున్నారు. ఆయుష్ శాఖలో సిబ్బంది హాజరు శాతం గతంలో 79.32గా ఉండగా, ప్రస్తుతం 81.89కు పెరిగింది.

రాష్ట్రంలోని నాలుగు ప్రధాన ఆయుష్ వైద్య కళాశాలలు, బోధనా ఆసుపత్రుల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. వీటిలో ఒక ఆయుర్వేద, మూడు హోమియోపతి వైద్య కళాశాలలు ఉన్నాయి. గుడివాడలోని డాక్టర్ గురురాజు ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల, ఆసుపత్రితో పాటు ప్రభుత్వ ఆయుర్వేద, హోమియోపతి వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న బోధనా ఆసుపత్రుల్లో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 21,420 ప్రయోగశాల పరీక్షలు, 148 ఎక్స్‌రేలు, 475 ఈసీజీ పరీక్షలు చేశారు.

జాతీయ ఆయుష్ మిషన్ కింద రాష్ట్రానికి రూ. 185.75 కోట్ల నిధులు ఆమోదం పొందాయి. రాష్ట్ర చరిత్రలో ఇవే అత్యధిక ఆమోదిత కేటాయింపులు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ఈ నిధుల నుంచి రూ. 38.18 కోట్లను వినియోగించారు. దీనికి అదనంగా, 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జాతీయ ఆయుష్ మిషన్ రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళిక కింద దాదాపు రూ. 22 కోట్ల అదనపు నిధులు మంజూ- రయ్యాయి. వైద్య సేవల విస్తరణ, వైద్యుల నియామకాలు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగిస్తున్నట్లు ఆయుష్ సంచాలకుడు రోణంకి గోపాలకృష్ణ తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో విజయం లక్ష్యంగా కూటమి సమన్వయం

- **వేమూరులో టీడీపీ నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం**



**వేమూరు, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వేమూరు నియోజకవర్గ టీడీపీ స్థాయి సమీక్ష సమావేశం వేమూరు సెంటర్‌లోని లక్ష్మీ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ, జిల్లా పరిశీలకుడు జంగా కృష్ణమూర్తి, బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికల కార్యాచరణ, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల మధ్య సమన్వయం తదితర అంశాలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ ఎన్నికలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని నాయకులకు సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నాయకులు జనసేన, బీజేపీ కూటమి నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సమావేశంలో పిలుపునిచ్చారు. కూటమి పార్టీల మధ్య పరస్పర సహకారం, సమన్వయం, ఉమ్మడి కార్యాచరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి మండలం, గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా పనిచేయాలని నేతలు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీతో ప్రజల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమృతలూరు, చుండూరు మండలాల టీడీపీ అధ్యక్షులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని కూటమి నాయకులతో నిరంతర సమన్వయంతో, ఐక్యతతో పనిచేయాలని సమావేశంలో దిశానిర్దేశం చేశారు.

## "మార్పు"వసతి గృహాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



**గుంటూరు, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్) :** "మార్పు" కార్యక్రమం క్రింద చేపట్టిన వసతి గృహాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. మార్పు కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్పు కార్యక్రమం క్రింద జిల్లాలో 36 వసతి గృహాలలో మంచి మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో చేపట్టడం జరుగుతోందని వివరించారు. వసతి గృహాలు ప్రవేశాలు, వంట గదిలో విధిగా సి.సి కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. తాడికొండ, రాజా గార్డెన్ లో వెంటనే బిసి వసతి గృహం, గురుకులం లలో పనులు తక్షణం ప్రారంభించాలని ఆదేశించారు. రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేయాలని, వాటి రూపు రేఖలు మారాలని అన్నారు. విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించుటమే లక్ష్యమని చెప్పారు. మంచి వాతావరణం ద్వారా వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని చెప్పారు.

ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా సాంఘిక సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఎన్.వెంకటరవణప్ప, రహదారులు భవనాలు శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ సి.విశ్వనాథరెడ్డి, ఎపిఇడబ్ల్యుఐసి కార్యనిర్వాహక ఇంజనీర్ అనిల్, హార్ట్ ఫుల్ నెస్ ఫౌండేషన్ డి.పి.ఎం హారిక తదితరులు పాల్గొన్నారు.

## స్పర్ష్-సీఎఫ్ఎంఎస్ బిల్లుల అప్‌లోడింగ్‌కు గడువు పెంచాలి: ఏపీటీఎఫ్

**అమరావతి, అక్టోబర్ 13(జర్నలిస్ట్ ఫైల్) :** ఇప్పటికే పాఠశాల అవసరాల కోసం ప్రధానోపాధ్యాయులు ఖర్చు చేసిన మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. హృదయరాజు, ఎస్. చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు. ఆ ఖర్చులకు సంబంధించిన బిల్లులను పాత విధానంలోనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నూతన స్పర్ష్ విధానంలో బిల్లుల మొత్తాలు వెండర్ ఖాతాలకు జమ అవుతాయని, దీంతో ఇప్పటికే ఖర్చు చేసిన పాఠశాలలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వారు తెలిపారు. అందువల్ల ఇప్పటికే చేసిన ఖర్చులకు పాత విధానంలోనే బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఇకపై చేసే ఖర్చులకు సంబంధించి స్పర్ష్-సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని, ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభుత్వాన్ని కోరారు.

## ఎన్ఆర్ఐటీలో విద్యార్థినుల ఆరోగ్యంపై అవగాహన సదస్సు

**విసదాల, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్):** విద్యార్థినుల్లో మహిళల ఆరోగ్యం, హార్మోన్ల సమతుల్యత, జీవక్రియ సంబంధిత సమస్యలపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో మేడికొండూరు మండలం విసదాలలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రత్యేక ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. తేజా ఏఐ టెక్ సర్వీసెస్ విద్యా కార్యక్రమంలో భాగంగా 'అండర్‌స్టాండింగ్ హార్మోనల్ అండ్ మెటాబాలిక్ హెల్త్ సెమినార్-2026' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.




సదస్సులో లీలా హాస్పిటల్స్ కన్సల్టెంట్ ప్రసూతి, స్త్రీరోగ వైద్య నిపుణురాలు డా. దీప్తి గుంటుపల్లి పీసీఓఎస్, పీసీఓడీ, పీఎంఎస్, ఇన్సులిన్ నిరోధకత, అలసట వంటి సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. హార్మోన్ల అసమతుల్యత, జీవక్రియ సంబంధిత సమస్యల లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం, అవసరమైనప్పుడు వైద్యుల సలహా తీసుకోవడం, ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం వంటి అంశాలను వివరించారు.

క్లినికల్ వెల్‌నెస్ కన్సల్టెంట్ కావ్య యడ్ల సమతుల్య ఆహారం, పోషకాహారం, క్రమబద్ధమైన జీవనశైలి, ఆరోగ్యకరమైన అలవాట్ల ప్రాధాన్యతను వివరించారు. రోజువారీ ఆహారపు అలవాట్లలో తగిన మార్పులు చేసుకోవడం, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకునే అలవాట్లను పెంపొందించుకోవడం ద్వారా దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా. దోలా సంజయ్ ఎస్., అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి. సీతారామయ్య, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. షేక్ లాల్ జాన్ బాషా, తేజా ఏఐ టెక్ సర్వీసెస్ ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు. లీలా హాస్పిటల్స్, విక్రమ్ హాస్పిటల్, గుంటూరు, హెర్బలైఫ్ సంస్థలు కార్యక్రమానికి భాగస్వాములుగా వ్యవహరించాయి.

విద్యార్థినుల్లో హార్మోన్ల, జీవక్రియ సంబంధిత ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందించడం, ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించడం, సమతుల్య ఆహారం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా ప్రోత్సహించడం సదస్సు ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు

# ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రూబీ జూబ్లీ వేడుకలకు ఉపరాష్ట్రపతి

- **అక్టోబర్ 26న హాజరుకానున్న సీపీ రాధాకృష్ణన్**



**విజయవాడ, అక్టోబర్ 13(జర్నలిస్ట్ ఫైల్) :** డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న రూబీ జూబ్లీ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అక్టోబర్ 26న హాజరుకానున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా. పి. చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతిని వేడుకలకు సాదరంగా ఆహ్వానించినట్లు మంగళవారం వెల్లడించారు.

విశ్వవిద్యాలయం నాలుగు దశాబ్దాల ప్రస్థానంలో వైద్య విద్య, ఆరోగ్య రంగాలకు అందించిన సేవలను గుర్తుచేసుకునేలా రూబీ జూబ్లీ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వీసీ తెలిపారు.

ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి హాజరు కావడం విశ్వవిద్యాలయానికి ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంటుందని పేర్కొన్నారు.

రూబీ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రారంభించినట్లు చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే అతిథులు, విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు తదితరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు.

వైద్య విద్య, ఆరోగ్య రంగాల్లో విశ్వవిద్యాలయం సాధించిన పురోగతిని సమీక్షించుకోవడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరింత నాణ్యమైన వైద్య విద్యను అందించే దిశగా రూబీ జూబ్లీ వేడుకలు స్ఫూర్తినిస్తాయని వీసీ చంద్రశేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో అభివృద్ధి పథంలో డి.ముప్పవరం గ్రామం

- **రూ. 8.18 కోట్లతో మారిన డి.ముప్పవరం ముఖచిత్రం..మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోన్న మంత్రి కందుల దుర్గేష్**




**నిడదవోలు, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ మంత్రి కందుల దుర్గేష్ నిరంతర కృషి, చొరవతో నిడదవోలు మండలంలోని డి.ముప్పవరం గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మౌలిక వసతుల కల్పన, రహదారుల నిర్మాణం, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థల విస్తరణ, సామాజిక భవనాల నిర్మాణాల ద్వారా గ్రామం ప్రగతి సాధిస్తోంది. గడిచిన రెండేళ్ల కాలంలో వివిధ పథకాలు, నిధుల ద్వారా డి.ముప్పవరం గ్రామానికి ఏకంగా రూ. 8.18 కోట్ల నిధులను మంజూరు చేయించి, పనులను వేగవంతంగా పూర్తి చేయడంలో మంత్రి దుర్గేష్ కీలక పాత్ర పోషించారు.

రూ. 16.80 లక్షలతో పల్లె పండుగ 1.0 క్రింద 3 పనులు, రూ. 28 లక్షలతో పల్లెపండుగ 2.0 క్రింద 2 పనులు చేపట్టి రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేశారు. వర్షాకాలంలో నీరు నిలవకుండా, దోమలు, అంటువ్యాధుల బారిన పడకుండా గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తూ రూ. 66.70 లక్షల పంచాయతీ నిధులు, రూ. 18 లక్షల జిల్లా ప్రజా పరిషత్ నిధులతో డ్రెయిన్ పనులు పూర్తి చేశారు. సిసి డ్రెయిన్ల నిర్మాణంతో గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడింది. గ్రామంలో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపుతూ రూ. 80 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులు తీసుకువచ్చి ఇంటింటి కుళాయి ద్వారా స్వచ్ఛమైన గోదావరి జలాలు అందించేందుకు కృషి చేస్తున్నారు. అదే రూ. 25 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన బీసీ కమ్యూనిటీ హాల్ తుది దశకు చేరుకుంది. ఇవేగాక పాడి రైతులు, పశుపోషకులకు చేయూతనందిస్తూ రూ. 4.60 లక్షలతో 2 గోకులం షెడ్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి రూ. 75 లక్షల శాస్కి నిధులతో డి.ముప్పవరం నుండి పురుషోత్తపల్లి వరకు రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల మధ్య రవాణాను సులభతరం చేస్తూ రూ. 5 కోట్లతో డి.ముప్పవరం నుండి కానూరు వరకు 12 కి.మీల పొడవైన అందమైన ఆర్ అండ్ బీ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ రహదారి నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేశారు. ఇది ప్రయాణికులకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణ అనుభూతిని అందిస్తోంది. అంతేగాక తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న గ్రామానికి చెందిన 11 మంది బాధిత లబ్ధిదారులకు రూ. 4.72 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించి ఆర్థికంగా కొండంత అండగా నిలిచారు.

గతంలో సరైన రోడ్డు సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడిన డి.ముప్పవరం గ్రామ ప్రజలకు మంత్రి కందుల దుర్గేష్ చొరవ ఒక వరంగా మారింది. "ప్రజల చెంతకే పరిపాలన -- ప్రతి గ్రామానికి అభివృద్ధి" అనే సంకల్పంతో అడుగేసిన మంత్రి దుర్గేష్ గ్రామంలోని ప్రతి వీధికి ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేశారు.

సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల ముఖచిత్రాన్ని మార్చేందుకు తనదైన శైలిలో పని చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్‌ను అభినందిస్తూ ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరూ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com